J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 32 12.01.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ఢిల్లీ నుండి గల్లీ వరకు

# కాంగ్రెస్‌లో కదలికలు

## తెలంగాణలో అధికారంలోకి.. ఏపీలో సమీకరణలు

## రాహుల్ గాంధీ రెండో విడత భారత్ జోడో యాత్ర

## లోక్‌సభలో 150 సీట్ల టార్గెట్...

## ఇం.డి.యా కూటమిలో ఇదే పెద్ద పార్టీ

**జాతీయ కాంగ్రెస్‌పార్టీలో 'కదలిక'లు మొదలయ్యాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాలలో జరగాల్సి ఉన్న లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌కు జవసత్వాలను తిరిగి సమకూర్చే దిశగా కాంగ్రెస్ 'ఫస్ట్ ఫ్యామిలీ' ప్రయత్నాలు ప్రారంభించింది.**

ఆ పార్టీ 'ఉత్తరాధికారి' రాహుల్‌గాంధీ గతంలో ఒకసారి 'భారత్ జోడో' పేరిట కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి ఈ భారత్ జోడో యాత్ర కూడా ఏదో ఒక మేరకు ఉపకరించింది అనే భావనలు అప్పట్లో వ్యక్తమయ్యాయి.

ఇక తెలంగాణ విషయానికొస్తే సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్, సౌరబ్ గంగూలీ, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, అనిల్ కుంబ్లె, గవాస్కర్, రవిశాస్త్రి లాంటి మాస్టర్ క్రికెటర్ల లాగానే, రాటుదేలిన దిగ్గజ నేతలు కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ, విగ్రహ పుష్టి.... నైవేద్య నష్టి... అన్నట్టుగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురాలేరని కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు భావించారు.

కింగ్ కోహ్లీ లాంటి నేత ఒకరు కావాలని.... వెదికి, వెదికి... రేవంత్‌రెడ్డిని పట్టుకుని తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించింది ఆ పార్టీ అధిష్టానం. ఆయనను పూర్తిగా సమర్థించింది. సీనియర్లు ఎవరూ తోకలు ఆడించకుండా కట్టడిచేసింది. దాంతో, కాంగ్రెస్‌పై తెలంగాణ ఓటర్లకు నమ్మకం కుదిరింది. ఫలితంగా అక్కడ అధికారం హస్తగతమయ్యింది.

### ఆంధ్రాలో పార్టీని బ్రతికించడమే లక్ష్యంగా..

ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న అతిపెద్ద టార్గెట్ ఆంధ్రప్రదేశ్. ఇక్కడ వచ్చే ఎన్నికల్లో కొన్ని సీట్లలో అయినా డిపాజిట్లు తెచ్చుకునే దిశగానన్నా పార్టీని ప్రజలలోకి తీసుకెళ్లాలని రాహుల్‌గాంధీ పట్టుదలగా ఉన్నారని ఆ పార్టీ వర్గాల సమాచారం. పూర్తిగా ఉనికి కోల్పోయి జీవచ్ఛవంలా ఉన్న పార్టీకి ఊపిరి పోయడమే లక్ష్యంగా అధిష్టానం పావులు కదుపుతోందని అంటున్నారు.

ఆంధ్రలోనూ ఉద్దండులైన ఆరితేరిన కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీలో ఉండేవారు. పచ్చని రాష్ట్రాన్ని విడగొట్టడంలో సోనియాగాంధీ తీసుకున్న మూర్ఖపు నిర్ణయం వల్ల 2014 ఎన్నికల నాటి నుండి రాష్ట్ర రాజకీయ రంగం నుంచి కాంగ్రెస్ అనే పార్టీయే కనుమరుగైంది. సుధీర్ఘ కాలంగా ఆ పార్టీని

10లో

### ఎన్నికల నేపథ్యంలో

# అయ్యేఎస్, ఐపీఎస్‌లకు భారీ కుదుపు

## నోటిఫికేషన్ రావడమే తరువాయి...

## యంత్రాంగమంతా ఎన్నికల సంఘం కనుసన్నల్లోనే

## సీఎస్, డీజీపీ సహా పైనుంచి కింది వరకు మార్పులు

## పేరు చివర 'రెడ్డి' అని ఉంటే.. బదిలీయే

**మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి శాసనసభకు, లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నోటిఫికేషన్ వెలువడిన మరుక్షణం... రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం కనుసన్నల్లోకి వెళ్లిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వాధినేతలకు ప్రభుత్వ యంత్రాంగంపై ఒక్క శాతం కూడా కంట్రోల్ ఉండదు.**

దీనిని దృష్టిలో పెట్టుకుని, రాష్ట్రంలో బదిలీ చేయాల్సిన మొత్తం అధికారుల జాబితాలను తెలుగుదేశం వ్యూహకర్తలు సిద్ధం చేసినట్టు తెలిసింది. నారా లోకేష్ బహిరంగ సభల్లో చూపించే "రెడ్ బుక్"లో ఈ జాబితాలే ఉన్నట్టు వినికిడి.

"బదిలీ చేయాల్సిన అధికారులు ఎవరు? వైసీపీకి అనుకూలంగా వారు ఎలా వ్యవహరించారు? తెలుగుదేశం నాయకులను ఎలా ఇబ్బంది పెట్టారు? వారి కుల గోత్రాలు ఏమిటి? వైసీపీ నేతలలో కొందరికి... సదరు అధికారులకి ఉన్న ఆత్మీయ ప్రేమానుబంధాలు, చుట్టరికాలు ఏమిటి? ఇప్పుడు ఉన్న స్థానాలకు వారు వచ్చి ఎంత కాలం అయింది?? ఎంత వెనకేసుకున్నారు??? మొదలైన సమస్త వివరాలతో టీడీపీ ఎన్నికల సంఘంకు ఓ భారీ నివేదిక సమర్పించనున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. "అటువంటి" అధికారులు అక్కడే కాకుండా ఎక్కడ విధుల్లో ఉన్నప్పటికీ నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికలు జరగడం సాధ్యం కాదని, అందువల్ల వారిని ఖాళీగా ఉంచాలని టీడీపీ ఎన్నికల సంఘాన్ని కోరనుందని వార్తలు వస్తున్నాయి.

### తెలంగాణ తరహాలో.. ఆంధ్రాలో కూడా

ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను, వరంగల్ కమిషనర్ ఏ.వీ.రంగనాథ్‌ను ఎన్నికల సంఘం పక్కన పెట్టేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే, వారిద్దరికీ పోస్టింగ్ ఇచ్చారు. సీవీ ఆనంద్ డీజీపీ స్థాయి అధికారి. అయినా క్షణాల్లో పక్కన పెట్టేశారు.

ఆంధ్రకు వచ్చేసరికి, సీ.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కూడా విధులనుంచి తప్పించడం తప్పనిసరి అని టీడీపీ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. ఇద్దరూ 'రెడ్డి' సామాజికవర్గానికి చెందినవారే కాకుండా ఇద్దరిదీ ముఖ్యమంత్రి సొంత జిల్లా కడప కావడం కూడా అభ్యంతరకర విషయంగా పేర్కొంటున్నారు. అందువల్ల, వీరిని విధుల నుంచి రిలీవ్‌చేసే విషయంలో మరో మాటకు తావు ఉండదని టీడీపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక 26 జిల్లాలలో... ఎక్కడైనా 'రెడ్డి'

10లో






# ధర్నాలు..ఆందోళనలు

## నెల్లూరు కలెక్టరేట్ వద్ద..నిరసనలు



నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 8న వివిధరంగాల కార్మికులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్న ప్రభుత్వం తీరు దారుణమంటూ అంగన్‌వాడీలు మండిపడ్డారు. గత కొద్దిరోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలతో పాటు మునిసిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు హోరెత్తించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్ళు రెహనా బేగం, ఐద్వా నాయకురాలు మస్తాన్‌బీ, సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు రషీద్, నాగేశ్వరరావు, కిన్నెర కుమార్, కొండా ప్రసాద్, అల్లాడి గోపాల్, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే, విధుల్లోకి రావాలంటూ అధికారులు నోటీసులు జారీచేయడం దారుణమని ఉద్యోగుల జేఏసీ నాయకులు నాగేశ్వరరావు, విష్ణువర్ధన్, విష్ణుప్రసాద్, రామారావు తదితరులు పేర్కొన్నారు.

## మైనింగ్ లారీల దూకుడుపై ఆందోళన



మైనింగ్ లారీల దూకుడుతో విపరీతమైన దుమ్ము ఇళ్ళల్లో కమ్ముకుంటోందని, అన్నం తినాలన్నా ఎంతో ఇబ్బందిగా ఉందంటూ సైదాపురంలో ఈనెల 8న పొదలకూరు సర్కిల్ వద్ద స్థానికులు ఆందోళన చేపట్టారు. మైనింగ్‌లారీలను అడ్డుకుని ఈ ఆందోళన నిర్వహించడంతో ట్రాఫిక్ రెండుగంటల పాటు స్తంభించింది. సైదాపురం నుంచి పొదలకూరు వెళ్ళే రోడ్డుపై ఉన్న గుంతలను ఎర్రమట్టితో పూడ్చారని, ఇప్పుడు అధిక లోడుతో వేగంగా వస్తున్న మైనింగ్‌లారీల ధాటికి ఆ మట్టంతా లేచిపోయి దుమ్మంతా ఇళ్ళలోకి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది కానీ, నిర్మాణం మాత్రం నేటికీ పూర్తికాలేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తమ అవస్థలు గమనించాలని వారు కోరారు.

## యానాదులకు భూ హక్కులు కల్పించాలి



అటవీచట్టం ప్రకారం యానాదులకు భూములపై హక్కులు కల్పించాలంటూ జనవరి 8న నెల్లూరు కలెక్టరేట్ వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నాందోళన జరిగింది. ఆ సమితి నాయకుడు బి.బాలచెన్నయ్య మాట్లాడుతూ, జిల్లాలో దళితులకు, గిరిజనులకు, యానాదులకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని, భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమితి నాయకులు జెడ్డా వాసు, వరమ్మ, శ్రీలక్ష్మి, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### 'ఎస్మా'ను రద్దు చేయాలంటూ..

## రోడ్డెక్కిన ప్రజాసంఘాలు

రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దుచేయాలంటూ నెల్లూరులో ఈనెల 9న ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. నగరంలోని ఏబీఎం కాంపౌండ్ వద్ద నుంచి వీఆర్‌సి సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వీఆర్‌సి కూడలిలో బైఠాయించి సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దశలో పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా అంకయ్య, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవీ ప్రసాద్, అజయ్‌కుమార్, మునిసిపల్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, రైతుసంఘం నాయకులు శ్రీరాములు, వెంగయ్య, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వెంకమరాజు, పుల్లయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆ చట్టం వద్దు - న్యాయవాదుల డిమాండ్

ప్రజల ప్రయోజనాలకు ఆటంకంగా ఉన్న ఏపీ భూ హక్కుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల 9న బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టులను బహిష్కరించి నెల్లూరులోని జిల్లాకోర్టు ఎదుట ఆందోళన నిర్వహించారు. న్యాయవాదులు పువ్వాడి శంకరయ్య, జి.రవికుమార్, బి. శ్రీనివాసులు, సిహెచ్ రమేష్ తదితరులు మాట్లాడుతూ, ఆ చట్టాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భానురామన్, మనోహర్, అజయ్‌కుమార్, సంజీవి, సాయికుమార్, శ్రీనివాస్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



### ముత్యాలమ్మ అమ్మవారికి..

## విశేష పూజలు

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో వెలసివున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 7న విశేష పూజలు జరిగాయి. అర్చకులు అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి అభిషేక సేవలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

### న్యాయవాదుల

## విధుల బహిష్కరణ

ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దుచేయాలంటూ న్యాయవాదులు చేస్తున్న విధుల బహిష్కరణను ఈనెల 12వ తేదీవరకు పొడిగించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఉమామహేశ్వరరెడ్డి, ఎన్.సుందరయ్య యాదవ్ తెలిపారు. ఈనెల 8న వారు నెల్లూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో న్యాయవాదులు ఆ చట్టాన్ని రద్దుచేయాలంటూ ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, నెల్లూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కూడా ఆందోళన కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని వారు కోరారు.

### జనవరి 22న..

## బడులకు సెలవులివ్వాలి

**- బీజేపీ నేత మిడతల వినతి**



జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో, ఎంతో ప్రాధాన్యత ఉన్న ఆ రోజును గుర్తుంచుకునేవిధంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు సెలవు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు, 'నమామి గంగే' ప్రముఖ్ మిడతల రమేష్ ఈనెల 8న జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## రేగడిచెలిక వద్ద కారు ప్రమాదం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, నెల్లూరుకు చెందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల విజయవాడ నుంచి నెల్లూరుకు వస్తుండగా మార్గమధ్యంలో కొడవలూరు మండలం రేగడిచెలిక వద్ద కారు ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న లారీ టైరు పంక్చర్‌కావడంతో వెనుక వస్తున్న కారు లారీని ఢీకొట్టి పక్కనే డివైడర్ పడిపోయింది. కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న పర్వతరెడ్డి పీఏ వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించారు. ఎమ్మెల్సీ తలకి గాయాలు తగిలాయి. అదృష్టవశాత్తు ఆయనకు తృటిలో ప్రమాదం తప్పింది. నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, ఎట్లనో ఆయన కోలుకున్నారు.

## చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఐజీ



నెల్లూరులోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌ను గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఇటీవల ఆకస్మిక తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఓటుహక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీసులకు సూచించారు. ఎన్నికలను పటిష్టవంతంగా, ప్రశాంతంగా నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఎస్పీ ప్రసాద్, నెల్లూరు నగర-రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, నగర ఇన్స్‌పెక్టర్‌లు బాబి, కళ్యాణరాజు, సుబ్బారావు, పీవీ నారాయణ, వీరానాయక్, చిన్నబజార్ ఎస్ఐ సైదులతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సాహంగా..పోలీస్ స్పోర్ట్స్



నెల్లూరులో ఇటీవల పోలీస్ సిబ్బందికి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి సారథ్యంలో అన్ని కేటగిరీలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా ఈ క్రీడల్లో పాల్గొన్నారు. నగరంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో వ్యక్తిగత పురుషుల విభాగంలో ఏఆర్ వింగ్‌కు చెందిన ఆర్ఎస్ఐ సురేష్, మహిళల విభాగంలో ఏఆర్ వింగ్‌కి చెందిన కానిస్టేబుల్ చందన చాంపియన్‌షిప్‌లు సాధించి అందరి ప్రశంసలందుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి క్రీడల్లో పాల్గొన్న పోలీసులందరినీ అభినందించారు.

## ఘనంగా రామ్ పుట్టినరోజు వేడుకలు



రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 58వ జన్మదిన వేడుకలు ఇటీవల నెల్లూరు దర్గామిట్టలోని సాల్వేషన్ చర్చిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత కేకు కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా పేదలకు అల్పాహారం, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వారసత్వాన్ని కొనసాగిస్తూ రామ్‌కుమార్‌రెడ్డి రాజకీయ రంగంలోనే కాక, సామాజిక సేవారంగంలోనూ బాగా రాణిస్తున్నారని ఆయన కొనియాడారు.

## డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో..సంక్రాంతి వేడుకలు

సంక్రాంతి పండుగల విశిష్టతలను బాలలకు తెలియజేస్తూ ఈనెల 8న నెల్లూరు సరస్వతీనగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌ల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయదుస్తుల్లో అందరినీ అలరించారు. పల్లె వాతావరణం ఉండేలా నిర్వాహకులు స్కూల్‌ను తీర్చిదిద్దారు. విద్యార్థులకు గాలిపటాల పోటీలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. భోగిపండ్లు పోసి చిన్నారులను దీవించారు. పాఠశాల జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైసీపీలో గజిబిజి గందరగోళం..!

## ఉండేదెవరో పోయేదెవరో తెలియక అయోమయంలో క్యాడర్!!





***ఎన్నికలనామ సంవత్సరం 2024 వచ్చినప్పటి నుండి ఆంధ్రలోని అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ గందరగోళం గజిబిజిగా మారిపోయింది. రోజుకొక పుకారు సామాజిక మాధ్యమాలలో షికారు చేస్తోంది.***

ముందుగా రాజ్యసభ సభ్యులు వేమి రెడ్డి ప్రభాకరరెడ్డి పార్టీని వీడి తెలుగు దేశంలో చేరబోతున్నట్లు వార్తలు వచ్చాయి. అవి బాగా ఊపందుకున్న రెండురోజుల తరువాత ఆయన ఆ వార్తలని ఖండించారు. తాను వైసీపీని వీడే ప్రసక్తే లేదని ఆ పార్టీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి పోటీచేయబోతున్నట్లు ఖరాకండిగా చెప్పేశారు. మళ్ళీ సామాజిక మాధ్యమాల ముఠా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి సీఎం సమీప బంధువు బాలినేని శ్రీనివాసులరెడ్డిలపై పడింది.

మాగుంటకు టిక్కెట్టు లేదని అధిష్టానం చెప్పేసిందని, ఆయన తెలుగుదేశంలో చేరి ఒంగోలు పార్లమెంటు నుండి ఆయన కుమారుడు రాఘవరెడ్డిని బరిలో దింపి, తాను నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా విపీఆర్‌పై పోటీ చేయబోతున్నారని వార్తలు బయలుదేరాయి. నెల్లూరు ప్రస్తుత పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డితో కూడా మాగుంట శ్రీనివాసులరెడ్డి చర్చలు జరిపారని, ఆదాలని కూడా మాగుంట పార్టీ మార్పించే ప్రయత్నాలు చేస్తున్నారని సామాజికమాధ్యమాల ముఠా హోరెత్తించింది.

మరోవైపు బాలినేని శ్రీనివాసులరెడ్డికి కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, ఆయన కూడా అలిగి హైదరాబాదుకి వెళ్ళాడన్న వార్త చక్కర్లు కొట్టింది. పనిలోపనిగా వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి ఒంగోలు పార్లమెంటు నుండి, సిద్దా రాఘవరావు ఒంగోలు అసెంబ్లీ నుండి పోటీ చేయబోతున్నారని కూడా సామాజిక ముఠాయే నిర్ణయించేసింది.

వైసీపీ అధిష్టానం మాత్రం ఈ వార్తలపై ఇంకా నోరు విప్పలేదు. ముహూర్తం బాగాలేదంటూ మూడవ జాబితా ప్రకటన వాయిదా వేసింది. మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు అభ్యర్థుల పేర్లతో మూడవ జాబితా రానున్నట్లు కూడా సామాజిక ముఠాయే నిర్ణయించేసింది. రాష్ట్రంలో ఇంకా చాలాచోట్ల అధికార పార్టీలో గజిబిజి పరిస్థితి నెలకొనివుంది. పార్టీలో ఎవరు ఉంటారు, ఎవరు వెళ్ళిపోతారు అన్న విషయం అర్థంకాక క్యాడర్ అయోమయంలో పడింది. ఎన్నికలు దగ్గర పడే ప్రతీసారీ ఆ పార్టీ వారు అలిగి ఈ పార్టీకి రావడం, ఈ పార్టీ వారు అలిగి మరో పార్టీకి వెళ్లడం సర్వ సాధారణమే. చివరికి అన్ని ప్రధాన పార్టీలు తమ తుది జాబితాలు ప్రకటించేవరకు ఈ గందరగోళ పరిస్థితి తప్పదు.

మాగుంట, బాలినేని విషయాలలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, వారే తొందరపడి అభాసుపాలవుతున్నారని తాడేపల్లి పెద్దాయన ఒకరు చెప్తున్నారు. నిజానిజాలేమిటో వైసీపీ అధినేతకి, ఆయన చుట్టూవున్న ఆ నలుగురికి మాత్రమే తెలుసనీ పార్టీ వర్గాలు అంటున్నాయి. మొత్తంమీద పండగ నాటికి మొత్తం క్లారిటీ వస్తే సంతోషంగా పండగైనా చేసుకుంటామని పార్టీ శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నారు!



## ముఖ్యమంత్రితో నేదురుమల్లి భేటీ

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలిశారు. ఇటీవల తమ నియోజకవర్గంలో జరిగిన సామాజిక బస్సుయాత్ర గురించి రామ్ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. చేనేతకారుల సమస్యలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కష్టపడి పనిచేయాలని సీఎం సూచించారు.

## పర్వతరెడ్డికి.. సీఎం పరామర్శ



ఇటీవల నెల్లూరుజిల్లా, రేగడచెలిక వద్ద జరిగిన కారు ప్రమాదంలో గాయపడి చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఈ నెల6న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఫోను ద్వారా పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తనను పరామర్శించిన సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డిలకు పర్వతరెడ్డి ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు.

## జయభారత్ ఆసుపత్రికి రూ.10 లక్షల విరాళం



నెల్లూరులోని జయ భారత్ ఆసుపత్రికి స్థానిక విఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు కొండ్లపూడి బలరామిరెడ్డి ఈ నెల 11న గురువారం నాడు 10 లక్షల రూపాయలను విరాళంగా ఆసుపత్రి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రత్యేకించి గిరిజనులకు అందుతున్న ఉచిత వైద్యసేవలను, బాల సంస్కార కేంద్రాల గురించి ఛైర్మెన్ వారికి వివరించారు. దాత బలరామిరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి కమిటీ వైస్‌ఛైర్మెన్ బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దాతకు ఆసుపత్రి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. సేవా దృక్పథంతో భారీ విరాళాన్ని అందజేసిన బలరామిరెడ్డికి 'లాయర్' అభినందనలు.



# 'సుప్రీం' తీర్పు.. అద్భుతం-చరిత్రాత్మకం

ఎట్టకేలకు మళ్ళీ ఆ రేపిస్టులు జైలుకి వెళ్ళేలా సుప్రీంకోర్టు తాజాగా మరో అద్భుతమైన తీర్పు వెల్లడించి దేశవ్యాప్తంగా ప్రజల, ప్రజాస్వామ్య వాదుల అభినందనలు అందుకుంటోంది. 2002లో గోద్రా రైలు దహన కాండ తర్వాత గుజరాత్‌లో జరిగిన భయంకరమైన అల్లర్లలో బిల్కిస్ బానో అనే మహిళ దుండగుల పాశవిక చర్యలకు గురైంది. 5 నెలల గర్భిణిగా ఉన్న ఆమెపై 11 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె కుటుంబసభ్యులైన ఏడుగురిని దారుణంగా హతమార్చారు. ఈ కేసుపై విచారణ జరిపిన సీబీఐ కోర్టు ఆ 11 మంది నిందితులకు అప్పట్లో యావజ్జీవఖైదును విధించింది. బొంబాయి హైకోర్టు ఆ శిక్షను ధృవీకరించింది. దోషులు దాదాపు 14 ఏళ్లపాటు జైలులోనే ఉన్నారు. అయితే, వారిలో ఒక నిందితుడు తనను విడుదల చేయాలంటూ కొంతకాలం క్రితం కోర్టును ఆశ్రయించడం, ఆ విజ్ఞప్తిని పరిశీలించాలని సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగాయి. దీంతో ఆ ప్రభుత్వం ఒక కమిటీని వేయగా, అర్జీ పెట్టుకున్న నిందితుడికే కాక, మొత్తం 11 మందికి రెమిషన్ ఇవ్వాలని ఆ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2022 ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ క్షమాభిక్ష ద్వారా వారంతా జైలు నుంచి విడుదలయ్యారు. వారికి గుజరాత్‌లో పెద్ద వీరుల మాదిరిగా ఘనస్వాగతాలు పలకడం మరీ దారుణం. అయితే, వారి విడుదలను సవాల్ చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానోతో పాటు మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కేసును క్షుణ్ణంగా పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన క్షమాభిక్ష ఉత్తర్వులను రద్దుచేయడం, ఆ నిందితులంతా రెండు వారాల్లో తిరిగి జైలుకు వెళ్ళాల్సిందేనని తాజాగా సంచలనాత్మక తీర్పు చెప్పడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఈ కేసులో నిందితులకు రెమిషన్ ఇవ్వడంలో గుజరాత్ ప్రభుత్వ వైఖరి సరికాదంటూ ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న తప్పుపట్టారు. వాస్తవానికి, నిందితులకు క్షమాభిక్ష పెట్టాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించలేదు. వారి అభ్యర్థనలను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించిందే తప్ప, నిందితులను విడుదల చేయాలని చెప్పలేదు. అయినప్పటికీ గుజరాత్ ప్రభుత్వం నిందితుల విడుదలకు చొరవ తీసుకోవడం పట్ల సుప్రీంకోర్టు అభిశంసించింది. అసలు, ఆ నిందితులకు క్షమాభిక్ష పెట్టే అర్హత గుజరాత్ ప్రభుత్వానికి లేదని, ఆ కేసు విచారణ చేస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం అలా సిఫారసు చేసే అధికారం ఉందని తేల్చిచెప్పింది. ఆ కేసు విచారణ గుజరాత్‌లోనే జరగాల్సి ఉండగా, సాక్షులకు బెదిరింపులు రావడంతో అప్పట్లో ఆ కేసును మహారాష్ట్రకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అలాంటిది, మహారాష్ట్ర ప్రభుత్వ అధికారాలను గుజరాత్ తన చేతిలోకి తీసుకోవడం ఏమిటని జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఇప్పుడు సూటిగా ప్రశ్నించింది. నిందితులను బయటకు తీసుకురావడం కోసం గుజరాత్ ప్రభుత్వం సుప్రీం ఆదేశాలను సైతం వక్రీకరించిన విషయం దీంతో బట్టబయలైంది. ఏదేమైనా, నిందితుల చేతిలో అత్యంత ఘోరమైన దారుణాలకు గురైన.. బాధితురాలైన మహిళకు న్యాయబద్ధమైన తీర్పు చెప్పి సుప్రీం కోర్టు అందరి ప్రశంసలందుకుంటోంది. ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు మరింతగా పెంచిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

లాయర్
జనవరి 12, 2024

గతంలో, అంటే 2022 గుజరాత్ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఆ నిందితులు విడుదలైనప్పుడు, పాలకపక్షం వారు వారికి వీరతిలకాలు దిద్ది, హారతులు పట్టి పండగ చేసుకోవడం, వారితోపాటు వేదికల మీదికి ఎక్కించడం వంటివన్నీ జరిగాయి. ఇంత సిగ్గుమాలిన చర్యలు దేశానికే తలవంపులు. ఒక నిందితుడు తనను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసుకుంటే, అదే అదనుగా యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఆ మొత్తం 11 మంది నిందితులను విడుదల చేసేందుకు గుజరాత్ ప్రభుత్వం అడ్డదారులు తొక్కిందనే విషయం ఈ తీర్పుతో బహిర్గతమైంది. రాజకీయ అండదండలున్నవారు ఎంతటి శిక్షలనైనా తప్పించుకోవాలని చూస్తుంటారనేందుకు ఈ ఉదంతమే ఒక తాజా ఉదాహరణ. అయితే, సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించడంతో వారి ఆటలు సాగలేదు. నేరస్తుల అంటకాగే ప్రభుత్వాలకు ఇదొక గుణపాఠం కావాలి. ఇకనైనా ప్రభుత్వాలు ఇలాంటి నిస్సిగ్గు చర్యలు మానుకోవాలి. ఈ నేపథ్యంలో 'నేనున్నా'నంటూ బాధితులకు భరోసా ఇస్తూ, సుప్రీంకోర్టు ఎంతో ఆశావహమైన తీర్పు వెల్లడించడం చరిత్రాత్మకం. ఏదేమైనా, సామాన్య మహిళ బిల్కిస్‌బానో ఎంతో ధైర్యంగా సుదీర్ఘ కాలం చేసిన న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించి విజయం సాధించడం ఎంతైనా హర్షదాయకం.

# జీర్ణం ... జీర్ణం వాతాపి జీర్ణం!

## గంజాయి సాగుని చట్టబద్ధం చేసేస్తే పోలా!!

ఇటీవల కొంత కాలంగా మన ప్రజాసేవకుల జీర్ణ ప్రక్రియలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని సామాజిక వైద్యులు చెప్తున్నారు. ఇంతకముందు, వేళకు నాలుగు మెతుకులతో తృప్తిపడేవారు. రానురాను, జీర్ణ ప్రక్రియ మరింతగా రాటు తేలిందా అన్నట్టుగా... ఏది కనబడితే అది ఆవురావురుమంటూ చప్పరించి మింగేస్తున్నారు.

"ఆయనకేంట్రా బాబూ! రాళ్లుదిన్నా అరాయించేసుకుంటాడు..." అనే సామెత కూడా పుట్టింది, అందుకేనేమో..!

'ప్రజా సేవకుడు' అన్న తరువాత ఆకలి, దాహం రెండూ ఎక్కువే. ఈ రెండిటికీ అధికారపక్షం.... ప్రతిపక్షం అనే తేడా ఏం ఉంటుంది చెప్పండి. వరస కుదరాలి... అంతే!

'ప్రజా సేవకుడు' అంటే ఏ మంత్రో, ఎం.పీనో, ఏ ఎంఎల్ఏనో అని అపోహపడతారేమో... అదేం కాదండోయ్.

'ప్రజా సేవకుడు' అంటే, వార్డు మెంబర్‌గా పోటీ చేద్దామనుకుని మానేసిన వారి దగ్గరనుంచి ఎన్నికకాబడ్డ వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్‌పీటీసీలు, ఎంఎల్ఏలు వారి మీద పోటీచేసి ఓడిపోయినవారు, పోటీచేద్దాం అనే స్థాయికి వచ్చిన వారు, తృణమో, ఫలమో పుచ్చుకుని మధ్యలో విరమించుకున్నవారు, వీరందరికీ దన్నుగా నిలబడినవారు, వీరి వెనకాల తిరిగేవారు, వైట్ & వైట్, రేబాన్ కళ్లద్దాలు, నైకీ బూట్లు, మెళ్ళో ఓ బంగారపు పలుపు గొలుసుతో, దేశసేవానురక్తితో జనంలో తిరిగే భావిభారత నేతలు అన్న మాట.

ఇలా వివిధ స్థాయిల్లో ఉన్న ప్రజా సేవకులనబడే వాళ్లు రాళ్లు, రప్పలు, మట్టీ, ఇసుక, కంకర, గ్రావెలు, కొండలూ, గుట్టలూ..., చివరికి గ్రానైట్ రాళ్లు తిన్నా నిముషాల్లో అరాయించేసుకుని మళ్ళీ ఆకలితో నకనకలాడిపోతున్నారు.

అవేమీ సరిపోవడం లేదన్నట్లు ప్రభుత్వ భూములు, ట్రస్టుల భూములు, విద్యాసంస్థల భూములు, దేవాలయాల భూములు మొదలైనవి కూడా మధ్య మధ్యలో అల్పాహారంగా స్వీకరిస్తున్నారు. ఈ చిరుతిళ్లకు అదనంగా లీటర్ల కొద్దీ మద్యపానం కూడా సేవిస్తున్నారు.

ఇన్ని రకాలుగా తింటున్నప్పటికీ, తాగుతున్నప్పటికీ వెధవది వాళ్ల ఆకలి, దాహం మాత్రం తీరడం లేదు.

ఇవే కాకుండా "మింగడానికి కాదేదీ అనర్హం" అన్నట్లుగా ఎవరి స్థాయిలో వారు కంట్రాక్టులు, కాంట్రాక్టర్ల దగ్గర పర్సెంటేజీలు, పైరవీలు, సెటిల్‌మెంట్లు, కబ్జాలు మొదలైన సవాలక్ష స్నాక్స్ తింటున్నా... చాలామంది ప్రజాసేవకులకు పంటి కిందికి కూడా రావడం లేదు.

పైపెచ్చు... "ఇతరులు తినేస్తున్నారు... తినేస్తున్నారు" అని నానా అల్లరి, నరఘోష.

### గంజాయిని చట్టబద్ధం చేసేస్తే పోలా!

నేతలు తింటున్న నానా గడ్డికి తోడుగా గంజాయి సాగును, పంపిణీని చట్టబద్ధం చేస్తే... ఇక ఎవరూ ఆకలితో అలమటించాల్సిన పనే లేదు. ఎవరి స్థాయిలో వారు తృప్తిగా... జఠరాగ్నిని చల్లార్చుకోవచ్చు. అనుయాయులకు కూడా తినిపించుకోవచ్చు.

'గంజాయి' అంటే మనిషి తయారు చేసేది కాదు. ప్రకృతి ప్రసాదం. కల్తీ ఉండదు, రసాయనాల అవసరం లేదు. స్వచ్ఛమైన ఆర్గానిక్.

బ్రాందీ, విస్కీ, రమ్ము, జిన్ను, బీరు, వోడ్కా మనిషి తయారు చేస్తాడు. కల్తీ చేస్తారు, కెమికల్స్ కలుపుతారు. ఇవేమీ లేకుండానే... ప్రకృతి ప్రసాదించిన గంజాయి ఈ మద్యం వెరైటీలు కలిగించే మత్తును సింగల్ హ్యాండెడ్‌గా కలిగిస్తుంది. పైపెచ్చు వాసన, గబ్బు ఉండదు. అల్లరి ఉండదు.

అందుకే గంజాయి సాగు, పంపిణీని "ఎందుకు చట్టబద్ధం చేయగూడదు అద్దెక్షా?" అనేది పాయింట్.




మరిజోనాగా పశ్చిమ దేశాలు పిలిచే ఈ గంజాయి వినియోగాన్ని అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో చట్టబద్ధం చేశారు. మా దగ్గర కూడా చట్టబద్ధం చేయాలంటూ కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు ఆందోళనలు కూడా చేస్తున్నారు.

మన దేశంలో గంజాయి పెంపకం, రవాణా, వినియోగంపై నిషేధం లాంటిది ఉంది. అందుకని, గంజాయి 'సాగు'చేసే పొలాలపై అప్పుడప్పుడూ పోలీసులో, ఎక్సైజ్ వాళ్ళో దాడులు చేస్తుంటారు.రవాణా చేసేటప్పుడు దాడులు చేసి పట్టుకుంటారు. 'అంత గంజాయి పట్టుకున్నాం. ఇంత గంజాయి పట్టుకున్నాం...' అంటూ మధ్య మధ్యలో ప్రకటనలు కూడా మీడియాలో వస్తుంటాయి.

తెలంగాణలో ఏ.వీ.రంగనాథ్, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి లాంటి పోలీసు అధికారులు ఉంటే... గంజాయి సాగుకు, రవాణాకి కూడా బోలెడంత కష్టం అయిపోతుంది. ఇప్పుడు ఒకాయన హైదరాబాద్ నేర విభాగం బాస్ అయితే రెండో ఆయన సిటీ కమిషనర్. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ముఖ్యమంత్రి పీఠం ఎక్కినప్పటి నుండి డ్రగ్స్ మాఫియాపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారుల వెంటపడుతున్నారు. కాబట్టి, "గంజాయి ముఠా" హైదరాబాద్ వదిలేసి, ఏ విశాఖపట్నమో రావాల్సి ఉంటుందేమో చూడాలి, మరి. భారతదేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా... దాని మూలాలు మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయంటూ వార్తలు వస్తున్న విషయం కూడా మనకి తెలియందేమీ కాదు.

ఎన్ని రకాలుగా తింటున్నా జఠరాగ్ని చల్లారక.. అల్లల్లాడుతున్న ప్రజా సేవకులు గంజాయి సాగు, వినియోగాన్ని చట్టబద్ధం చేయిస్తే ఇక, ఆకలి తీరకపోవడం అనే సమస్యే ఉండదు. ఆకలి తీర్చుకోడానికి భూములు, అడవులు, గనులు, ఇసుక, కబ్జాలు, కమిషన్లు, లంచాలపై ఆధారపడాల్సిన పని ఉండదు.

ఏ రకంగా చూసినా మద్యపానం కంటే గంజాయే అన్ని రకాలుగా శ్రేయస్కరం. మద్యం నాసి రకమని... కల్తీ అని... అదని... ఇదని... ఏడుపులు, పెడబొబ్బలు పెడ్తుంటారు. గంజాయిలో ఇవేమీ ఉండవు. కల్తీ కుదరదు. కెమికల్స్ కలపరు. నాసిరకం అనే ప్రశ్నే లేదు. పైపెచ్చు ప్రకృతి ప్రసాదం.

దీనిని చట్టబద్ధం చేయడం వల్ల, ప్రజా సేవకుల దృష్టి... సంప్రదాయ వనరుల వేట పైనుంచి గంజాయి సాగు, రవాణాపైకి మళ్లుతుంది. ఆకలి తీర్చుకోడానికి ఇతర సహజ వనరులపై పడాల్సిన పని లేదు.

తలా ఒక గంజాయి ప్యాకెట్ ఇచ్చి, సభలు, సమావేశాలకు తోలుకు వస్తే సభలు కిటకిటలాడతాయి. మధ్యలోనే లేచి... గోడలు దూకి పారిపోరు. ఏ ఊళ్లోవాళ్లు ఆ ఊళ్లోనే ఓ గంజాయి ప్యాకెట్ బిగించి... పడుకుని ఊహల్లో తేలిపోతుంటారు కనుక, రోడ్లతో పనిలేదు. వాటి మీదున్న గుంతలతోనూ పని లేదు. మద్యం అయితే ఖాళీ సీసాలు ఎక్కడ పడేయాలి అన్నది ఓ సమస్య. గంజాయి అయితే ఆ సమస్యే లేదు.

గంజాయి పండించే(గిరిజన) రైతులకు, వారితో పని చేయించుకునే ప్రజా సేవకులకు, రవాణాదారులకు, అమ్మకందారులకు ఇలా అందరికీ చేతినిండా పని. దీనివల్ల జనానికి బాధలు గుర్తుకురావు. జీతాలు, నాతాలు పెంచండంటూ అల్టిమేటంలు, హెచ్చరికలు, ధర్నాలు, ముట్టడింపులు, శాపనార్థాలు ఉండవు. ఎన్నికలొచ్చినప్పుడు... ఈవీఎంలలో ఏ బటన్‌ను నొక్కమని చెబితే, ఆ బటనే నొక్కుతారు. ప్రభుత్వం కూడా ఒక్క రూపాయి అప్పు కోసం అటూ ఇటూ పరిగెత్తాల్సిన పనిలేదు. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు, నాతాలు ఇచ్చేయవచ్చు. ప్రజా సేవకులు కూడా రెండు చేతులా 'ప్రజా సేవ' ఇరగదీసేయవచ్చు. పైపెచ్చు ఈ తిండి పెర్మనెంటు. అందరి దృష్టి గంజాయి వనం వైపు ఉంటే, మిగిలిన ప్రకృతి వనరులకు కాస్తంత ఊపిరాడుతుంది.

సామాన్యులకు ఉపశమనం కల్పించడానికి... అధికారంలో ఉన్నవారే ఏదో ఒక ఉపాయం కనిపెట్టాల్సిన రోజులు వచ్చాయి. గంజాయిని చట్టబద్ధం చేయాలని ప్రజానేతలంతా ఒక్కటై ఉద్యమించాలి. అవసరమైతే ప్రభుత్వాధినేతలని ఒప్పించి సాధించుకోవాలి! - రాజశ్రీ











# రమణీయ కమనీయ వైభవం

## ప్రణీత్ - జోర్డాన్‌ల కళ్యాణ వైభోగం!

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు దివంగత తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీదేవమ్మల మనుమడు, అమెరికాలో స్థిరపడిన తుంగా శివప్రశాంత్ - లాలసల ఏకైక కుమారుడు **డాక్టర్ ప్రణీత్ - జోర్డాన్**(అమెరికా వాస్తవ్యులు జేమ్స్ బెడో -స్టెఫెనీల కుమార్తె)ల పెళ్లి వేడుకలు డిసెంబర్ 28, 29 తేదీలలో అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలోగల షాంటలీ నగరంలో భారతీయ మరియు పాశ్చాత్య సంప్రదాయాలలో వైభవోపేతంగా జరిగాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని ట్రిపుల్ ఐటీల ఛాన్సలర్, ప్రఖ్యాత విద్యావేత్త 'పద్మభూషణ్' రాజ్‌రెడ్డితో పాటు అటు అమెరికాలోని రెండు కుటుంబాల బంధుమిత్రులు, భారతదేశం నుండి వెళ్లిన తుంగా కుటుంబసభ్యులు ఈ శుభవేడుకల్లో పాల్గొని కొత్త దంపతులను దీవించారు.

ప్రణీత్ - జోర్డాన్ జంటకి 'లాయర్' ఆత్మీయ ఆశీస్సులు.










# క్యాన్సర్ బాధితునికి.. ప్రసన్న రూ.లక్ష సాయం



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన వలంటీర్ మెరీనా కుమారుడు మోక్షిత్ జాయ్‌కి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 9న లక్ష రూపాయల సాయం అందించారు. తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితునికి ఆ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. సాయం అందించినందుకు బాధితుని కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ప్రసన్నకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాకు కొరత లేకుండా యూరియా

నెల్లూరుజిల్లాకు మరో 1500 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైంది. కృష్ణపట్నం ఓడరేవులో నౌకల ద్వారా దిగుమతి అయిన యూరియాలో ఇప్పటివరకు 600 మెట్రిక్ టన్నులు జిల్లాకు కేటాయించడం జరిగిందని, మరో మూడురోజుల్లో మిగిలిన 900 మెట్రిక్‌టన్నుల యూరియా రాగానే జిల్లాలోని సహకార సంఘాలకు, రైతుభరోసా కేంద్రాలకు పంపిస్తామని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఆయన అదాని కృష్ణపట్నం పోర్టులో యూరియా నిల్వలను పరిశీలించారు.

## గణతంత్ర వేడుకలకు..

# ఎన్‌బికెఆర్ విద్యార్థి



జనవరి 26న న్యూఢిల్లీలో పెద్ద ఎత్తున జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇసిఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఇ.అభిసాయి కీర్తన్‌పాల్ ఎంపికయ్యాడని నేవీ వింగ్ ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ డా.వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్‌సిసి విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోనూ, సమాజ సేవా కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొంటుండడం అభినందనీయమన్నారు. తమ కళాశాల నేవీ వింగ్ నుండి విద్యార్థులు వరుసగా రెండు సంవత్సరాలు రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. కళాశాల ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



తెలుగుదేశం అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఘనవిజయం సాధించిపెట్టాలని మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 9న నెల్లూరులోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఆయన 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ వైకాపా వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. వైకాపా పాలనలో కొత్తగా ఏ పరిశ్రమలూ రాలేదని, పర్యాటకాభివృద్ధి జరగలేదని విమర్శించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు, టీడీపీ నాయకులు కాకర్ల వెంకట్రావు, మల్లికార్జునరావు, శ్రీనివాసులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

## మహనీయుడు.. డా.బిఆర్ అంబేద్కర్



ప్రతి భారతీయుని గుండెలో భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప మేధావి, మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ది చెరగని ముద్ర అని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. ఈనెల 9న స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో రాష్ట్రమంతా పండగ వాతావరణంలో అంబేద్కర్ స్ఫూర్తిని చాటేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకర మన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు, అణగారిన జాతులవారు ఉద్యోగం, రాజకీయ రంగాల్లో రాణించేలా రాజ్యాంగంలో హక్కులు కల్పించిన గొప్ప మేధావి డా. అంబేద్కర్ అని ఆమె కొనియాడారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప దార్శనికులని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, జడ్పీ సీఇఓ చిరంజీవి పాల్గొన్నారు.

## అయోధ్యరాముని అక్షింతల వితరణ

నెల్లూరులోని సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ, వేదగణపతి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 9న అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. అందరికీ ఆ శ్రీరామచంద్రుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ స్థానిక చంద్రమౌళినగర్, సావిత్రినగర్‌లలోని ప్రజలకు నిర్వాహకులు అక్షింతలు అందజేశారు.

## రాష్ట్రంలో అరాచక పాలన

### - టీడీపీ నేత బీద రవిచంద్ర



రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దెబ్బకు బడా పారిశ్రామికవేత్తలు నలిగిపోతున్నారని, అభిమానం తాకట్టు పెట్ట లేక, జగన్‌ను ఎదిరించి నిలవలేక, వ్యాపారాలను వదులుకోలేక, వచ్చిన లాభాలను వైకాపా వారికి దోచిపెట్టలేక సతమతమైపోతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఈనెల 9న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన వైకాపాకి మరోసారి అధికారం ఇస్తే ఇక సామాన్యులను కూడా దోచు కుంటారని విమర్శించారు. జిల్లా అభివృద్ధిని దృష్టిలోపెట్టుకుని ప్రజలంతా బాగా ఆలోచించి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సమా వేశంలో టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, షేక్ అమ్ముల్లా, దర్శి హరికృష్ణ, మహిళానేతలు తాళ్లపాక అనూరాధ, పనబాక భూలక్ష్మి పాల్గొన్నారు.




## ఎంపీలకు.. డీటీసీ చందర్ శుభాకాంక్షలు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను జిల్లా ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) చందర్ ఈనెల 8న వారి వారి కార్యా లయాల్లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కూడా ఆయన శుభా కాంక్షలు చెప్పారు. చందర్ వెంట ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఏఎంవీఐ రఘువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## వాకర్స్ కొత్త కార్యవర్గం.. ప్రమాణస్వీకారం



జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 8న నెల్లూరులోని సిపిఆర్ కల్యాణమండపంలో జరిగింది. వాకర్స్ గవర్నర్‌గా పలగాటి శ్రీనివాసులురెడ్డి, డెప్యూటీ గవర్నర్‌గా కనకట్ల రఘురాం ముదిరాజ్, జిల్లా పిఆర్‌ఓగా నలుబోలు బలరామయ్యనాయుడుతో పాటు, ఎంవి రెడ్డి, వేలూరు రంగారావు, ఏకొల్లు రాఘవరెడ్డి, వినుకొండ వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు, మాజీ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## 18 వరకు.. సంక్రాంతి సెలవులు

సంక్రాంతి పర్వదినాల సందర్భంగా జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవులు ప్రకటించడం జరిగిందని, సెలవురోజుల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే ఆ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని ఈనెల 8న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాజన్న భవన్‌లో సంబరాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రకు అయిదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 9న నెల్లూరు లోని రాజన్న భవన్‌లో వైకాపా విద్యార్థి విభాగం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థి నాయకుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సతీష్, సన్నీ, తౌఫిక్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో..ముగ్గుల పోటీలు



సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరు లోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎస్ఆర్ మునిసిపల్ స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు జ్యోతిరెడ్డి, నిత్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.






### వైసీపీ తరఫున..

## నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్నా

### - స్పష్టం చేసిన రాజ్యసభ సభ్యులు విపిఆర్



తాను వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తర ఫున నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్నానని, ఇందులో ఎలాంటి సందేహం లేదని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) స్పష్టం చేశారు. పలు మీడి యాల్లో తనపై లేనిపోని అసత్యాలు ప్రచారమవుతున్నాయని, వాటిని నమ్మ వద్దని ఆయన చెప్పారు. నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అనుగుణంగా జరిగిన సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన ప్రమేయం లేకుండా మీడియాలో జరుగుతున్న ప్రచారం తనకు ఆశ్చర్యం కలిగిం చిందని ఆయన అన్నారు. అందుకే వాటి గురించి తాను పట్టించుకోవడం లేదని అన్నారు. అలాంటి అసత్య ప్రచారాలు చేయడం సరికాదని అన్నారు. ఎలాంటి అపోహలు వద్దన్నారు. దాంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## వివిఎస్‌యులో అవగాహన సదస్సు



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 8న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అమెరికా నుంచి ఆచార్య శ్రీనివాసు(డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్–టోనీ బ్రేక్ యూనివర్సిటీ) ముఖ్యఅతిథిగా పాల్గొని, తాను చేపట్టిన వివిధ పరిశోధనల గురించి చెప్పారు. వివిఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి, శ్రీనివాస్ చేసిన పరిశోధనలను ప్రశంసించి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయకుమార్‌బాబు అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా.ఉదయ్ శంకర్, డా. కిరణ్మయి, డా. విద్యాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్..

## జాయింట్ సెక్రటరీగా కుల్లూరి



ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా జాయింట్ సెక్రటరీగా కుల్లూరి ప్రభాకర్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో ఆయన నియామకం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశమిచ్చిన ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబుకు, జిల్లా అధ్యక్షులు మంద బాబ్జికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ముందస్తు సంక్రాంతి వేడుకలు



నెల్లూరు కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 8న ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానో పాధ్యాయుడు యం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 20వ డివిజన్ ఇన్‌చార్జి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి సురేష్‌బాబు రంగవల్లుల పోటీల్లో గెలు పొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సంబరాల్లో పద్మాయాదవ్, రమాదేవి, రాజా, గోపాల్‌రెడ్డి, రసూల్, నాగేశ్వర రెడ్డి, వాసంతిరెడ్డి, సువార్త, డానియల్, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు



# వైకాపాలో బడుగులకు పెద్దపీట

## సామాజిక సాధికార యాత్రలో రామ్

తమ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ బీసీ మైనార్టీ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని, ప్రజలకు అన్నిరకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల రాపూరులో పెద్దఎత్తున జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఆయన అన్నారు వైకాపా అధికారంలోకి వచ్చినప్పటినుంచి రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు, మరెన్నో అభివృద్ధి పథకాలను ప్రజలకు అందిస్తూ, మాటతప్పని-మడమతిప్పని సీఎంగా ప్రజల ఆదరణ పొందుతున్నారని రామ్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ వైఎస్ జగన్‌ను సీఎంగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యాత్రలో వైకాపా ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు..ప్రముఖ సినీనటుడు ఆలీ, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ దొంతు శారద తదితరులు పాల్గొన్నారు.

## రామ్ జన్మదిన వేడుకలు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కేక్ కట్‌చేసి రామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బాబు గెలిస్తే.. ప్రజలకు సంక్షేమ పథకాలు గల్లంతే!

## నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్ళీ వైకాపాను గెలిపించి, సీఎంగా జగన్ ఉండేలా చూసుకోవాలని, ఒకవేళ పొరపాటున చంద్రబాబునాయుడుకు మద్దతు ఇస్తే ప్రజలకు సంక్షేమ పథకాలు ఉండవని నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న నెల్లూరు రూరల్ మండలంలో పింఛన్ లబ్దిదారులకు పెరిగిన రూ.3వేల పింఛన్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మంచి చేసే జగనన్న కావాలో.. అబద్దాలతో నిత్యం ప్రజలను మోసం చేసే చంద్రబాబు కావాలో అందరూ ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు



ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అవ్వ-తాతలు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు రూ.2వేలు ఉన్న పింఛన్‌ను రూ.3వేల వరకు పెంచిన ఘనత దేశంలో ఒక్క ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరికి మంచి చేయాలన్న తపనతో సంక్షేమ, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావాలో, సీఎంగా తన 14సంవత్సరాల పరిపాలన కాలంలో ఇచ్చిన ఏ హామీని కూడా నిలబెట్టుకోలేని చంద్రబాబునాయుడు కావాలో ప్రజలే విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపీపీ విజయకుమార్, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, కోసూరు కేశవులుగౌడ్, మధుసూదన్ రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో శైలేంద్రకుమార్, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఊళ్లమ్మ తల్లిని దర్శించుకున్న.. విపిఆర్, ఏపిఆర్

రాజ్యసభ సభ్యులు, వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్), నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి (ఏపిఆర్) ఇటీవల నెల్లూరు రూరల్‌మండలంలోని కోడూరుపాడు గ్రామదేవత ఊళ్లమ్మ తల్లి కుంభాభిషేకం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి ఇతర ముఖ్య నాయకులతో కలిసి వారు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీలను గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.




మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి పదేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు
లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - స్నిగ్ధ | సోమిరెడ్డి అగస్త్య | |

స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు
W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
జననం: 1938 మరణం: 15-01-2014



# ప్రతిభ చాటుకున్న ఎన్‌బికెఆర్ విద్యార్థులు

- 'ఆక్సంచెర్' కంపెనీ ఉద్యోగాలకు 70 మంది ఎంపిక
- అయిదుగురికి రూ.6.6 లక్షల వార్షిక వేతనం

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్న విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు చాటుకున్నారు. ఇటీవల ప్రముఖ బహుళజాతి సంస్థ 'ఆక్సంచెర్' నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పరీక్షలకు, ఇంటర్వ్యూలకు హాజరై ఏకంగా 70 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. వీరిలో అయిదుగురు విద్యార్థులకు గరిష్ట వేతనంగా రూ.6.6 లక్షలు, మిగిలిన 65 మంది రూ.4.6 లక్షల వార్షిక వేతనం పొందే ఉద్యోగాలు సాధించారు. ఎన్‌బికెఆర్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 35 మంది, ఇసిఇ విభాగం నుంచి 24 మంది, ఇతర విభాగాల నుంచి మరో 11 మంది విద్యార్థులు ఆ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక కావడంతో కళాశాలలో పండుగ వాతావరణం అలముకుంది.

కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి ఎన్.కిషొందర్ ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. సంక్రాంతి సెలవుల తర్వాత టీసిఎస్, టెక్ మహేంద్ర వంటి బహుళజాతి సంస్థలు ప్రాంగణ ఎంపికల కోసం రానున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఆ ఎంపికల్లో కూడా ఎన్‌బికెఆర్ విద్యార్థులు తమ సత్తా చాటుతారని ఆశిద్దాం!...

# అల్లూరు జాతర.. అదిరిపోయింది

- బంగారుచీరలో మెరిసిపోయిన శ్రీ పోలేరమ్మ
- లక్షకు పైగానే తరలివచ్చిన భక్తజనం





అల్లూరు పోలేరమ్మ అమ్మవారి జాతర అదిరిపోయింది. అమ్మవారి కటౌట్లు, విద్యుద్దీపాలంకరణలతో పేటంతా దేదీప్యమానమైంది. తప్పెట్లు, కోలాటాలు, కథాకళి నృత్యాలు, పాటకచ్చేరీలు, తీన్‌మార్ బ్యాండ్లు, కీలుగుర్రాలు, బొట్టబొమ్మలు, వీరతాళ్ళు, డీజే సౌండ్‌లతో, బాణసంచా వేడుకలతో అల్లూరుపేట మారుమ్రోగిపోయింది. అమ్మవారి భక్తిపాటలు మిన్నుముట్టాయి. అల్లూరు గ్రామదేవత.. అందరినీ కాపాడే చల్లనితల్లి..మహిమాన్విత శక్తిస్వరూపిణి శ్రీ పోలేరమ్మ అమ్మవారికి పెద్దఎత్తున నిర్వహించిన జాతరతో అల్లూరుపేటలోని అన్ని వీధులు క్రిక్కిరిసిపోయాయి. ఏఎంసి మాజీ ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి సారధ్యంలో, గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో, ఉత్సవ కమిటీ నేతృత్వంలో అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి అద్భుతంగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు చీరతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో భక్తుల ఆనందానికి అవధుల్లేవు. అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి నివాసం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రీతిపాత్రమైన సద్దిని తీసుకువచ్చి, పోలేరమ్మ చెట్టు వద్ద ఉన్న పోతురాజు మండపం చెంత నైవేద్యంగా సమర్పించారు. ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల కరెస్పాండెంట్ అల్లంపాటి లోకేష్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు డిఎస్ఆర్ బ్రదర్స్, ఇసనాక మస్తాన్‌రెడ్డి, కెఎస్ఆర్ ఫౌండేషన్ వారు, దగుమాటి(కావ్య) కృష్ణారెడ్డి, చెన్నకేశవస్వామి దేవాలయం ఛైర్మెన్ మేడా రామకృష్ణారెడ్డి, పోలేరమ్మ అమ్మవారి దేవాలయం ఇఓ చిట్టిబాబు తదితరుల సహకారంతో అమ్మవారి జాతర నయనానందకరంగా సాగింది. ఒక్క పూల అలంకరణలకే లక్షలాది రూపాయలు వ్యయం చేశారు. భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో అన్ని ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరిగాయి. సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని అమ్మవారి దర్శనం పుణ్యప్రదమని తండోపతండాలుగా.. సుమారు లక్షమందికిపైగానే భక్తజనం తరలివచ్చారు. అల్లూరు(ఊరు) ప్రజల ఆధ్వర్యంలో గత మంగళవారం అమ్మవారి తిరునాళ్ళ వైభవంగా జరిగితే, ఈ మంగళవారం(జనవరి9) అల్లూరుపేట ప్రజలు అమ్మవారికి భారీఎత్తున జాతర నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# అంగన్‌వాడీల నిరసన హోరు

ప్రభుత్వం తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా అంగన్‌వాడీలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈనెల 8వతేదీన వారు ఎస్మా జీవో ప్రతులను తగలబెట్టి ఆందోళన కొనసాగించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రకటించడం దారుణమన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ఈ నిరసనలో నాయకులు ఇంద్రావతి, పెంచలమ్మ, ముని, లక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు జేవీవీ భోజనాలు



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూలి కిషోర్‌రెడ్డి దాతృత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల నిరుపేద గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతులమీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, కిషోర్ రెడ్డి, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, కటకం శ్రీను, ప్రభాకర్, వెంకట్, అశోక్, విష్ణు, గుర్రం విజయ్‌బాబు, సుబ్రహ్మణ్యం, సారథి, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.



# శిరోమణిశర్మకి పూర్ణకుంభ పురస్కారం

రాజమహేంద్రవరంలో జరుగుతున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలలో భాగంగా ఈ నెల 5వ తేదీన నెల్లూరీయులు, కవిపండితులు బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మను రాష్ట్ర ఉన్నత న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, గజల్ శ్రీనివాస్, చైతన్య రాజు పూర్ణకుంభ పరస్కారంతో సత్కరించారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ప్రకాశం జిల్లా రామాయపట్నంలో గత నెల 24, 25 తేదీల్లో జరిగిన 43వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గూడూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.పురంధర్‌రాజు 400మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

## సూపరింటెండెంట్ పుట్టినరోజున

# సిబ్బందికి నిత్యావసర సరుకులు



గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా జన్మదిన వేడుకలు ఇటీవల ఘనంగా జరిగాయి. పలువురు డాక్టర్లు, సిబ్బంది ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షరీనా ఆమె సొంత నిధులు 30వేల రూపాయలతో పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బందికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

# 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో మయూరి శ్యామ్



శ్రీకృష్ణ సేవాసమితి ద్వారా గూడూరు, పరిసర ప్రాంతాలలో 15 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్)ను విశిష్ట పురస్కారం వరించింది. మయూరి శ్యామ్ యాదవ్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఆయనకు 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్(టిబిఆర్ అవార్డ్స్) అవార్డు లభించింది. విద్య, వైద్యంతో పాటు, ప్రజలకు కరోనా సమయంలో విరివిగా సేవలందించిన కారణంగా ఈ అవార్డును ఆయన పొందారు. 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి ఈ అవార్డును మయూరి శ్యామ్‌యాదవ్‌కు ప్రదానం చేశారు.

## స్ఫూర్తిసేవా సంస్థ ఆధ్వర్యంలో

# సంక్రాంతి ముగ్గుల పోటీ



యువత ముగ్గుల విశిష్టతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని రాంనగర్‌లో స్ఫూర్తి సేవాసంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఈ నెల 7న నిర్వహించారు. ఈ పోటీలో విజేతలైన మహిళలకు డాక్టర్ సి.రోహిణి, విఎస్ఆర్ స్కూల్ అధినేత బాలకృష్ణంరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మరాజు, దయాకర్, మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నష్టపరిహారం పంపిణీలో కూడా వివక్షతేనా?

## - మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ




మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహార పంపిణీలో కూడా వైకాపా నాయకులు వివక్షత చూపించడం ఏమిటని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. వెంకటాచలం మండలంలోని కంటేపల్లి గిరిజనులకు మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం పూర్తిగా ఇవ్వకుండా రూ.వెయ్యి రూపాయలు చొప్పున ఇచ్చి, మిగిలిన సొమ్ము వైసీపీ నాయకులు మింగేయడం దారుణమని ఆరోపించారు.

కంటేపల్లి గ్రామంలో ఇటీవల 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ, అన్ని వర్గాలకు తుఫాన్ నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతిని విస్మరించిన వైకాపాకు సామాజిక సాధికారత బస్సు యాత్ర చేపట్టే నైతిక హక్కు లేదన్నారు. గిరిజన కాలనీకి వెళ్లిన సోమిరెడ్డికి తమకు తుఫాన్ పరిహారం సొమ్ము పూర్తిగా ఇవ్వలేదని, ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి రూపాయలు చొప్పున మాత్రమే తుఫాన్ పరిహారం అందించారని చెప్పడంతో ఆయన వెంటనే అధికారులకు ఫోన్‌ద్వారా ఫిర్యాదుచేశారు. గిరిజనుల తరపున ఉన్నతాధికారులకు లేఖ రాసి, మిగిలిన తుఫాన్ పరిహారం సొమ్మును గిరిజనులకు అందేలా కృషి చేస్తామన్నారు. ఇప్పుడున్న ధరల ప్రకారం తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం కింద రూ.6 వేలు చొప్పున నగదు, 40కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకోలేనప్పుడు వైసీపీ ప్రభుత్వం సామాజిక సాధికారత బస్సు యాత్రలు చేపట్టడం ఎందుకని ప్రశ్నించారు. శాంతియుతంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణమన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి, అణిచివేయాలని అనుకోవడం సరికాదని అన్నారు.

# పడారుపల్లి గంగమ్మ దేవాలయంలో చోరీ

నెల్లూరు పడారుపల్లిలోని గ్రామదేవత గంగమ్మ దేవాలయంలో మంగళవారం వేకువన చోరీ జరిగింది. సోమవారం రాత్రి పూజల అనంతరం అర్చకుడు ఆలయానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. వేకువఝామున ఓ అగంతకుడు అమ్మవారి గర్భాలయం తాళాలు పగలగొట్టి, అమ్మవారి మెడలోని మంగళసూత్రాన్ని తెంపుకుపోయాడు. ఆ దుండగుడు పరారవుతున్న సందర్భంలో ఆలయ కమిటీ సభ్యులొకరు గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా చిక్కకుండా పారిపోయాడు. వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ నారాయణ సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

# వైసీపీలో హాహాకారాలు!



ఆంధ్రప్రదేశ్ మూడవ శాసనసభ ఎన్నికల ముంగిట్లోకి అడుగుపెట్టిన వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ తన పార్టీ శాసనసభ్యులు, ఎం.పీలకు వరుసగా షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. నవ్వుతూ లోపలికి వెళ్లి, ఏడుస్తూ బయటకు వచ్చేవారు, ముక్కు చీదుకుంటూ..., క్యాంపు ఆఫీస్ నుంచి కళ్ల నీళ్ల పర్యంతమవుతూ బయటపడేవారు..., తమ కాళ్ళ మీద పడకుండానే... కడుపు చించుకునేవారు..., "తడిగుడ్డతో నా గొంతు కోశారు" నాయనో... దేవుడో అంటూ శోకండాలు పెట్టే వారు, పెళ్లి పీటల మీద నుంచి, ఆ పసుపు బట్టలతోనే లేచిపోయి వేరే కుర్రాడిని అప్పటికప్పుడు లైన్‌లో పెట్టేసినట్టుగా వైసీపీలోనుంచి అదే పార్టీ కండువాతో తెలుగుదేశం ఆఫీస్‌కి వెళ్లిపోయి, అప్పటికప్పుడు చంద్రబాబునాయుడుని పొగడ్తలతో ముంచెత్తేవారు... మొదలైనవారితో బెజవాడ రాజకీయం కళకళలాడిపోతోంది.

"తాడేపల్లి క్యాంపు ఆఫీస్" పేరు చెబితేచాలు... వైసీపీ ఎంఎల్ఏలు ఉలిక్కి పడుతున్నారు. టెర్రర్. వణుకు. పై ప్రాణాలు పైన... క్రింది ప్రాణాలు క్రిందా పోతున్నాయ్. స్తబ్దుగా ఉన్న రాజకీయం ఒక్కసారిగా క్రియాశీలకం అయిపోయింది.

ఘనత వహించిన మన ప్రజాసేవకులు గతంలో ఇలా రోడ్డునపడడం చూడలేదు.

శాసనసభ మొత్తం స్థానాలలో దాదాపు 86 శాతం స్థానాలు అధికారపార్టీ గెలవడం... ఒక టాకింగ్ పాయింట్ అయితే, పరిపాలనా దక్షుడిగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన నారా చంద్రబాబునాయుడుకు కేవలం 13శాతం స్థానాలే లభించడం ఓ పెద్ద 'టాకింగ్ పాయింట్'గా మారిపోయింది.

అంత బలంతో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జగన్... మీడియాతో గానీ, మంత్రులతో గానీ, తన పార్టీ ఎంఎల్ఏలతో గానీ మాట్లాడడానికి ఏమాత్రం సుముఖంగా లేకపోవడం కూడా జనంలో ఒక పెద్ద 'టాకింగ్ పాయింట్'. "ఎందుకు?" అనే విషయం మాత్రం అంతుబట్టదు. ముఖ్యమంత్రి హోదాలో అధికారాన్ని చలాయించవలసిన వారి స్థానంలో.... ఏ రాజ్యాంగ అర్హతలూ లేని ఓ ప్రైవేట్ వ్యక్తి అధికారాలను చలాయించడం అన్నది... 'ఔరా' అంటూ ప్రజలు ముక్కున వేలేసుకునేలా చేస్తున్న మరో కామిక్ 'టాకింగ్ పాయింట్'. వైసీపీలో మంత్రులుగా నియమితులైన వారి స్థాయి, వారి రాజకీయ స్టాండర్డ్‌లు, వారి భాషా సంస్కారం, వారి వ్యవహారశైలి... వారి నృత్యప్రదర్శనలు... వగైరా వగైరా వగైరా మరో 'టాకింగ్ పాయింట్...'. "జగన్ మాత్రం ఏం చేస్తారు. ఆయనకు ప్రత్యామ్నాయం లేదు." అంటూ వ్యాఖ్యానించే వారు కూడా లేకపోలేదు.

ఇవన్నీ రాష్ట్ర రెండో శాసనసభ విశేషాలే.

ఈ అయిదేళ్ల అడవులు, నదీ నదాలు, చెరువులు, వాగులు, గనులు, ఇసుక రీచ్‌లు, మట్టి దిబ్బలు నాకేస్తూ... సారా యాపారాలు, దొంగ రవాణాలు, కబ్జాలు చేసేసిన... బొక్కేసిన వారి జాబితా చూసి, మన ముఖ్యమంత్రి జగనన్న దిగ్భ్రమం చెందినట్టు ఉన్నారు.

ఎందుకంటే... ఈ లత్తుకోరు పనులకు ఆయన వ్యతిరేకం. ప్యూర్ ఆనెస్ట్. పాలనలో అవినీతి ఉండగూడదు అనే భావనతోనే ఓటర్లకు మొత్తం క్యాష్ పంపకాలు అన్నీ బటన్ నొక్కడం ద్వారా వారి ఖాతాల్లోకి నేరుగా మళ్లిస్తున్నారు.

ఇంత స్వచ్ఛ పాలనను ఆయన ఒక పక్క అందిస్తుంటే... మరో పక్కన మూడో శాసనసభ 'ఎన్నికల గండం' ఒక్కొక్క అడుగే వేసుకుంటూ ముందుకు వస్తోంది. జగనన్న మళ్ళీ ఓ అయిదేళ్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు అనితర సాధ్యమైన రీతిలో..., రాజకీయాలే గర్వించే విధంగా ప్రజాసేవ చేయాలీ అంటే... ఆ ఎన్నికల గండం విజయవంతంగా దాటాలి.

"ఎన్నికల గండం దాటడం" అంటే.. 175 మంది శాసనసభ్యులు ఉండే శాసనసభలో సగం మంది పైబడి అభ్యర్థులనైనా గెలిపించుకోవాలి. లేకపోతే, మరోసారి ముఖ్యమంత్రి కావడానికి రాజ్యాంగం ఒప్పుకోదు.

ఇప్పుడు ఉన్నవాళ్లను చూస్తేనేమో కొడాలి నాని టైపు. వీళ్ళను పెట్టుకుని, మళ్ళీ అయిదేళ్లు ప్రజాసేవ చేయడానికి జగన్‌కు మనసొప్పడం లేదు. చాలాచోట్ల... ఇప్పుడున్న వారినే నించోపెడితే... ఆర్.నారాయణ మూర్తి సినిమాల్లో లాగా జనం, చేతికి అందిన కర్రో... చీపురో తీసుకుని వాళ్ళ వెంటపడతారు అంటూ 'సర్వే'శ్వరరావులు జగన్‌కు సీక్రెట్ నివేదికలు ఇచ్చేశారు. దాంతో, ఆయన బెల్టు తీశారు. సజ్జల రామకృష్ణారెడ్డికి ఇచ్చారు. అన్న ఆదేశాలకు అనుగుణంగా సజ్జల రామకృష్ణారెడ్డి, జగనన్న కార్యదర్శి ధనంజయరెడ్డి ఇచ్చే షాక్ ట్రీట్‌మెంట్‌కు ఎంఎల్ఏలు, ఎంపీలు చేసే ఆర్తనాదాలు, హాహాకారాలు తాడేపల్లిలో మిన్ను ముడుతున్నాయ్. అవి వినడం ఇష్టం లేక... జగన్ వారి మొహాలు కూడా చూడడం లేదు. క్యాంపు ఆఫీస్‌లోనే.... ఆయన పనిలో ఆయన బిజీగా ఉంటున్నారు.






ఆయన మనసు చాలా సున్నితం. ఎదుటి వారికి కష్టం వస్తే చూడలేరు. అందుకే, కాబోయే మాజీ ఎంఎల్ఏల ఆర్తనాదాలను ఆయన పట్టించుకోవడం లేదు.

దొంగలు, జేబు దొంగలు, చిల్లర దొంగలు, మార్నింగ్‌వాక్‌కు వెళ్లే మహిళల మెడలలో గొలుసులు స్నాచింగ్ చేసేవారు. ఇళ్లకు కన్నాలు వేసేవారు, బ్లేడు బ్యాచ్ అనేవాళ్ళు, వంటికి ఆముదం రాసుకుని.. కిటికీ సువ్వలు వంచి ఇళ్లల్లోకి జొరబడి దొంగతనాలు చేసేవారు.. రాష్ట్రమంతా... అక్కడా అక్కడా సహజంగానే ఉంటుంటారు.

వాళ్ళ విషయం పోలీసులు, పోలీసుల విషయం వాళ్ళూ చూసుకుంటూ ఉంటారు. సమాజంలో అలజడి ఉండదు. పౌర జీవనం మామూలుగా... సాఫీగా సాగిపోతూనే ఉంటుంది.

కానీ, వీరందరూ ఒకే చోట గుమిగూడితే!?.... ఒకే ప్రాంతంలో చేరితే...?

అందరూ కట్ట గట్టుకుని జనం మీద, ఆడపిల్లల మీద, పోలీస్‌స్టేషన్ల మీద, ప్రభుత్వ భూముల మీద, దేవుడి గుళ్ల మీద, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల మీద ఒక్కసారిగా... మూకుమ్మడిగా పడిపోతే...!? చాలా నియోజకవర్గాల్లో జనానికి 'ప్రజా సేవకుల'ను, వారి అనుయాయులను చూస్తుంటే, వీరందరూ గుర్తొస్తున్నారంటున్నారు.

తనలాగా వినమ్రతతో, నిజాయతీగా, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయమని, ముఖ్యమంత్రి వారిని గెలిపించి పంపిస్తే... వారిలో చాలా మంది పాత రోజులనాటి స్టువర్టుపురం బ్యాచ్‌ల్లా తమమీద పడిపోయారంటూ జనం రగిలిపోతున్నారు. ఆ విషయాన్ని కనిపెట్టిన "సర్వే"శ్వరులు ముఖ్యమంత్రి చెవిన ఈ శుభవార్త వేశారు.

సమాజ సేవ చేస్తారని ఎంఎల్ఏలు, ఎంపీలను చేస్తే... ఏమిటీ "సమాజ షేవ్" అనుకుంటూ ముఖ్యమంత్రి కుపితులైపోయారు.

"ఈ అయిదూ... పదేళ్లలో తిన్నంతవరకు చాల్లే... ఇక తప్పుకోండి..." అంటూ ఇంటికి పిలిచి, జగనన్న తరపున వినయంగా... ప్రేమగా... అనునయంగా, అభిమానంగా ఆయన ప్రతినిధులు చెబుతుంటే... బయటకు వచ్చి హాహాకారాలు చేస్తున్నారు.

నిజానికి, వీరిని ఈసారికి మందలించి, క్షమించి వదిలేయాల్సింది.

ఎందుకంటే , వైసీపీకి ప్రత్యేకంగా ఓటర్లు ఉన్నారు. గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఓడిపోయినప్పుడు, "దీనిని మేం పట్టించుకోం. వారికి ఓట్లేసింది మా ఓటర్లు కాదు. మా ఓటర్లు వేరు. ఈ ఎన్నికల్లో వాళ్ళు ఓటు వేయలేదు" అంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

రేపు 'వైసీపీ సొంత ఓటర్లు' రంగంలోకి దిగుతారు. వారికి వాలంటీర్లు, గ్రామ – వార్డు సచివాలయ సిబ్బంది, పోలీసులు, పోలింగ్ స్టాఫూ సాయంగా ఉంటారు. అందువల్ల 175కు 175 స్థానాల్లో జగనన్నను గెలిపిస్తారు. ఈ థియరీ కరెక్టు అనుకుంటే, వీళ్ళను తీసేయడం, తీసేయాల్సిన మరికొందరిని వేరే నియోజకవర్గాలకు పంపడం, ఎం.పీలను ఎంఎల్ఏ స్థానాలకు... ఎంఎల్ఏలను ఎం.పీ స్థానాలకు పంపడం ఎందుకూ అన్నది విజ్ఞులకు అర్థం కావడం లేదు. ఇప్పుడు తీసేస్తున్న స్థానాలలో వచ్చేవారు... వీళ్లనే మంచివాళ్ళు అనిపిస్తారేమో అనే భయాలు కూడా జనాలలో లేకపోలేదు.

రాష్ట్రంలో ప్రతి "కుటుంబానికీ మేలు జరిగితే మీ బిడ్డను ఆశీర్వదించండి." అని జగనన్న విజ్ఞప్తి చేస్తుంటే... ఆ ప్రసంగాలు వినకుండా జనం మాత్రం పుంజీలు తెంపుకుంటూ మీటింగులు నుంచి పారిపోతున్నారంటూ మీడియాలో కథనాలు ప్రసారం అవుతున్నాయి. రాష్ట్రంలో జనం మూడ్‌కు ఇవి అద్దం పడుతున్నాయనే వ్యాఖ్యానాలు గట్టిగానే వినబడుతున్నాయి.

అందుకే ఎన్నికలు వస్తున్నాయి అంటే... వైసీపీలో తీసేసిన తాశీల్దార్లులే (అంటే తీసేసిన ఎంఎల్ఏలు) గాక, తీసేయని తాశీల్దార్లు కూడా బిక్కుబిక్కుమంటూ రాజకీయం నెట్టుకొస్తున్నారు. శకునాలు ఏవీ పెద్ద అనుకూలంగా కనపడడం లేదనేది వాళ్ళ వర్రీ.

ఆ 'ఇద్దరే' జగన్‌కు వ్యతిరేకంగా ఉన్నారని అంటున్నారు. ఒకరు పురుషులు, రెండవ వారు మహిళలు.

జగన్ పాలన తీరుకు... ఎక్కడికక్కడ దిగ్భ్రమకు లోనవుతున్న వీరు చంద్రబాబు వైపు ఆబగా చూస్తున్నారనే వాతావరణం రాష్ట్రాన్ని కమ్మేసింది. 'ఇదే పబ్లిక్ పెర్సెప్షన్'. అయితే, దీని గురించి జగన్‌కు, ఆయన కోర్ టీమ్‌కు పెద్ద పట్టింపేమీ లేదు. "జనం ఏమి అనుకుంటే ఏంటి? మేం చేయాల్సింది మేము చేస్తాం" అనే భావన ఇందుకు కారణమై ఉండవచ్చు.

వైసీపీ శ్రేణులలో ఆ ధైర్యం ఉన్నట్టు లేదు. హాహాకారాలకు ఇది కూడా ఓ కారణం అని అంటున్నారు కొందరు విశ్లేషకులు.

"అదృష్టం ఒక్క సారే తలుపు తడుతుంది. దురదృష్టం మాత్రం తలుపు తీసేదాకా తడుతూనే ఉంటుంది" అని ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో "మంచి మాట" పేరిట ఒక సూక్తి ప్రచురించారు. అయితే, చంద్రబాబు నాయుడు విషయంలో మాత్రం ఈ సూక్తిని రివర్స్‌లో చెప్పుకోవాలేమో! "తలుపు తీసేదాకా అదృష్టం ఆయన తలుపు తడుతూనే ఉంటుంది" అని.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# కాంగ్రెస్‌లో కదలికలు

(మొదటి పేజీ తరువాయి)

అంటిపెట్టుకుని ఉన్న నేతలంతా సగం మందిపైగా వైసీపీలోకి, కొంతమంది బీజేపీలోకి జారిపోగా, మరి కొంతమంది రాజకీయ అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. రఘువీరారెడ్డి లాంటి నిజాయితీపరులైన నాయకులూ వ్యవసాయం చేసుకుంటుంటే, ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటివారు, రామోజీరావు, పోలవరం అంటూ గోలచేస్తూ అప్పుడప్పుడూ మీడియా ముందుకొచ్చి తమ ఉనికిని తెలుపుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. పల్లంరాజు వంటి సీనియర్లు కూడా ఇంటిపట్టునే ఉంటూ బాగా వళ్ళు చేశారు. రాజశేఖరరెడ్డికి ఆత్మ లాంటి కేవీపీ రామచంద్రరావు సైతం "అలవిగాని చోట అధికులమనరాదు అన్నట్లుగా" ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితికి ఈ సంఘటనలన్నీ అద్దం పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న అచేతన స్థితి నుంచి కాంగ్రెస్‌ను పైకి లేపడం మామూలు పరిస్థితులలో అయితే అయ్యేపని కాదు. కానీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సోదరి షర్మిల రూపంలో కాంగ్రెస్‌కు లాటరీ తగిలిందనే చెప్పాలి.

తెలంగాణలో వేలుపెట్టి కాల్చుకున్న షర్మిలకు అక్కడ తనకి స్థానం లేదని ఆలస్యంగా అర్ధం కావడం, ఆంధ్రలో తన సోదరుడి లాగా సొంతంగా పార్టీ పెట్టుకునే అవకాశం లేకపోవడంతో, కాంగ్రెస్‌లో చేరడం తప్ప ఆమెకు మరో మార్గం లేకపోయింది. అలాగే, ఆంధ్రాలో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితుల్లో ఉన్న కాంగ్రెస్‌కు ఆమె తప్ప మరో ప్రత్యామ్నాయం కనపడలేదు. దీంతో "పరస్పర ప్రయోజనాల" ప్రాతిపదికగా షర్మిలను కాంగ్రెస్ నాయకురాలిగా చేసేశారు. ఆమే ఆంధ్ర కాంగ్రెస్ కాబోయే ఛైర్‌పర్సన్ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఒక టీవీ ఇంటర్వ్యూలో ప్రకటించారు. దీంతో, ఏపీ కాంగ్రెస్‌లో 'కదలిక' మొదలైంది. వైసీపీ నుండి కూడా ఆవిడపై విమర్శలు మొదలయ్యాయి. అంటే ఆమె రాకను వైసీపీ కూడా గుర్తించిందనే అనుకోవాలి. షర్మిలకు 'ఆంధ్ర కాంగ్రెస్ చాణక్యుడు' కేవీపీ రామచంద్రరావు సలహాలు అందుబాటులో ఉంటాయి. ఇటు రేవంత్‌రెడ్డి, అటు కర్ణాటక ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'అన్ని' విషయాలలోనూ దన్నుగా ఉంటారనే ఆంధ్ర కాంగ్రెస్‌వాదులు భావిస్తున్నారు. ఏమో...., గుర్రం ఎగరావచ్చు అన్నట్టుగా ఆంధ్రాలో కాంగ్రెస్ ఆశ్చర్యకరమైన ఫలితాలు నమోదు సాధించినా సాధించొచ్చని పరిశీలకులు అంటున్నారు.

కారణం ఏమైనప్పటికీ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం కాంగ్రెస్‌కు తిరిగి రావడం పట్ల కాంగ్రెస్ వాదులలో మాత్రం హర్షం వ్యక్తం అవుతోంది.

## 150 సీట్లన్నా సాధించాలన్న తపనతో .....

ఇక, జాతీయస్థాయిలో చూసుకుంటే... కర్ణాటక, తెలంగాణలో మెజారిటీ లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం అనే భావన రాజకీయవర్గాలలో ఉంది. ఈ రెండు రాష్ట్రాలలోను 45 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అందులో 30 నుంచి 35వరకు కాంగ్రెస్‌కు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.

తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకేతో కాంగ్రెస్ జతకట్టి ఉంది. ఇక్కడ 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ కనీసం 10 స్థానాలకు పైబడే గెలిచే అవకాశాలు ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనే ఇక్కడ నుంచి కాంగ్రెస్ 8 స్థానాలు గెలిచింది. 2019లో తమిళనాడు నుంచి 20 స్థానాలు గెలిచిన డీఎంకే రేపు ఎన్ని స్థానాలు గెలిచినా అవన్నీ కాంగ్రెస్ ఖాతాలో ఉన్నట్టే లెఖ్ఖ. ఒక విధంగా డీఎంకే అన్నది కాంగ్రెస్‌కు అనుబంధ పార్టీగా రాజకీయవర్గాలు పరిగణిస్తుంటాయి. ఆ విధంగా చూస్తే దక్షిణ భారతదేశంలో కాంగ్రెస్ ఓ తిరుగులేని రాజకీయశక్తిగా ఆవిర్భవించబోతోందన్నది స్పష్టమైపోతోంది.

మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. శివసేన, శరద్ పవార్, కాంగ్రెస్ కలిసి ఈ 48 స్థానాలలో 35 వరకు గెలుచుకునే అవకాశం ఉంది. అలాగే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తిస్‌ఘడ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ – బీజేపీల మధ్య పోటాపోటీగానే ఉంటుంది. బీజేపీకి ఏకపక్ష విజయాలు లభించే అవకాశాలు ఉండే పరిస్థితులు లేవు. బీహార్‌లో కూడా కాంగ్రెస్ స్థితి నిరాశాజనకంగా ఏమీ లేదు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ లాగా, బీహార్‌లో ఆర్‌జేడీ నేతలైన తేజస్వియాదవ్, లాలూ ప్రసాద్‌యాదవ్ కాంగ్రెస్‌కు బాసటగా నిలబడతారు అన్న భావన రాజకీయవర్గాలలో ఉంది.

ఎటొచ్చీ, ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఒడిశా, ఢిల్లీ వంటి రాష్ట్రాలలోనే కాంగ్రెస్ పరిస్థితి అనుకూలంగా లేదన్నది రాజకీయవర్గాల వారి వాదన. బెంగాల్లో మమతా బెనర్జీ, ఉత్తరప్రదేశ్లో సమాజ్‌వాదీ పార్టీ అఖిలేష్‌యాదవ్ మాత్రం రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల సుముఖంగా లేరు. అయితే, ఇం.డి.యా. కూటమిలో కాంగ్రెస్‌పార్టీ గెలిచే సంఖ్యలో సగం సీట్లు సైతం తెచ్చుకోగల పెద్ద పార్టీ మరొకటి లేదు.

ఈ లోటును ఎంతో కొంత భర్తీ చేయడానికి, కాంగ్రెస్‌కి అనుకూలంగా లేని రాష్ట్రాలలో ఆ పార్టీ పరిస్థితిని కొంతమేరకైనా మెరుగుపరుచుకునే ఉద్దేశంతో రాహుల్‌గాంధీ ఇప్పుడు రెండో విడత భారత్ జోడో యాత్ర మొదలుపెడుతున్నారు. వయసు రీత్యా, సోనియాగాంధీ అంత చురుకుగా రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనలేకపోయినప్పటికీ అన్నాచెల్లెళ్ళు రాహుల్, ప్రియాంక ఆ బాధ్యతలను పూర్తిగా తీసుకోవడం కూడా కాంగ్రెస్‌లో కొత్త కదలికలకు కారణం అని చెప్పవచ్చు. ప్రియాంక రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఆశాజనకమైన పరిస్థితి ఏర్పడిందన్నది యూత్ కాంగ్రెస్ నాయకుల నోటి నుండి వినపడుతున్న మాట. కాంగ్రెస్‌పార్టీ స్థితి గతంలో కంటే, ఇప్పుడు గణనీయంగా మెరుగుపడిందనే విషయాన్ని ప్రధాని నరేంద్రమోడీ కూడా గుర్తించినట్టు కనపడుతోంది.

తనకున్న అద్భుతమైన మేధస్సుతో ప్రపంచంలోనే "బెస్ట్ మార్కెటింగ్ మేనేజర్" కాదగిన సమస్త అర్హతలూ ఉన్న నరేంద్రమోడీ... ఒక్క నిముషం కూడా టీవీ చానెళ్లను వదలడం లేదు. ఊహాతీతమైన రీతిలో ఆయన "ఇమేజ్"ను ప్రమోట్ చేసుకుంటున్నారు. పంచభూతాల సాక్షిగా గతంలో ఏ ప్రధాని చేయనన్ని సాహసాలు చేస్తున్నారు. లక్ష ద్వీప్‌లో ఆయన ఇటీవల జరిపిన పర్యటన ఆ కోవకు చెందినదే.

ప్రధానిని వేలెత్తి చూపడానికి దొరికే ఏ చిన్న అవకాశాన్నీ రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వదులుకోవడం లేదు.దేశం కూడా రాహుల్ – ప్రియాంక వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకుంటున్నట్టే కనబడుతోంది. అంతిమంగా మరో రెండు లేదా మూడు నెలలలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని స్థానాల్లో గెలుస్తుంది అనే అంశంపైనే "ఇం.డి.యా" కూటమిలో కాంగ్రెస్ మాటకు ఎంత విలువ ఉంటుందనే విషయం ఆధారపడి ఉంటుంది. రాబోవు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా కడప నుంచి షర్మిల లోక్‌సభకు పోటీ చేయవచ్చుననే పుకారు రాష్ట్ర రాజకీయవర్గాలలో జోరుగా షికారు చేస్తోంది. అదే జరిగితే, తెలుగుదేశం–జనసేన కూటమి అక్కడ పోటీచేయదు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా కాంగ్రెస్‌కు ఒక సీటు వచ్చినా వింతేమీ లేదని రాజకీయవర్గాలు అంటున్నాయి.

మొత్తంమీద ప్రియాంక రాకతో జాతీయ కాంగ్రెస్‌లోను, షర్మిల చేరికతో ఆంధ్రా కాంగ్రెస్‌లోనూ కదలిక వచ్చిందన్నది మాత్రం వాస్తవం. కర్ణాటక, తెలంగాణాలలో సాధించిన విజయం కూడా మధ్యలో వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బాగా ఉపకరిస్తుందన్నది పార్టీ వర్గాల ఆశ. ఢిల్లీ నుండి గల్లీ దాకా నాయకుల్లో కార్యకర్తల్లో చలనం కలిగేలా పార్టీని, క్యాడర్‌ని ఉత్సాహపరుస్తున్న యువతరం పార్టీని గెలుపుబాట పట్టించడంలో ఎంతవరకు సఫలమవుతారో వేచి చూడాలి!

# అయ్యాయెస్, ఐపీయస్‌లకు భారీ కుదుపు

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లు, 'రెడ్డి' ఎస్పీలు ఉంటే వారు కూడా ఎన్నికల సంఘం రాడార్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఎన్నికల సంఘానికి ఇప్పటికే స్పష్టత వచ్చినట్టు చెప్తున్నారు. విజయవాడలో కలెక్టర్లు, ఎస్పీలను కమిషన్ అడిగిన ప్రశ్నలు, వ్యక్తంచేసిన ఆగ్రహావేశాలను బట్టి అధికార యంత్రాంగంలో భారీ ప్రక్షాళన తథ్యం అని కూడా పరిశీలకులు భావిస్తున్నారు.

'రెడ్డి' కలెక్టర్లు, ఎస్పీలతో పాటు, ఇతరత్రా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తారన్న అనుమానం ఉన్నవారి జాబితాని తెలుగుతమ్ముళ్లు తయారు చేస్తున్నారంట. డీఎస్పీ స్థాయివరకు ఈ జాబితాలను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. "ఇందులో కొత్త ఏమీలేదు. కిందటిసారి వైసీపీ చేసిన పనే... ఇప్పుడు మేం చేస్తున్నాం..." అని రాయలసీమకు చెందిన ఒక ముఖ్య టీడీపీ నేత వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రభుత్వంలో ఏ ఉద్యోగికైనా ఏసీఆర్ (యాన్యూ వల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్) ఆయా శాఖాధిపతి రాస్తారు. అదే ఐఏయస్ అయితే ఆ రిపోర్టుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాస్తారు. వాస్తవ పరిస్థితులు, ఏ ఐఏఎస్ అధికారి వ్యవహారశైలి ఎలా ఉంటుందో ఆయనొక్కడికే తెలిసి ఉంటుంది.

అదే ఐపీయస్ అధికారులు అయితే, వారి ఏ.సీ.ఆర్‌లు డీజీపీ రాస్తారు. కానీ, ఆ పనిని వారిద్దరి నుంచీ తొలగించి ముఖ్యమంత్రికి అప్పగిస్తూ రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఒక జీ.ఓ. జారీ చేసింది.

అప్పటినుండి... జీ హుజూర్ అంటూ ఐఏయస్‌లు అయ్యాయెస్‌లు అయిపోగా, ఐపీయస్‌లు అయ్యాపీయస్‌లుగా మారిపోయారని ఒక రిటైర్డ్ ఐఏయస్ అధికారి కామెంట్ చేయడం కూడా ఆలోచించదగిన విషయం.

గత ఎన్నికల(2019)లో ప్రధాన కార్యదర్శిని మార్చారు. ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వర రావును మార్చారు. పలువురు డీఎస్పీలను మార్చారు. దాదాపు 35 మంది డీఎస్పీలపైన "కమ్మ" అనే ముద్రవేశారు. నిజానికి వారిలో కమ్మ కులానికి చెందినవారు అయిదుగురే. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని "నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా" అన్న తరహాలో ఇంటికి పంపించాల్సిన అధికారుల జాబితా సిద్ధం చేసుకుని, నోటిఫికేషన్ కోసం టీడీపీ – జనసేన కూటమి ఆశగా ఎదురుచూస్తోందని విశ్వసనీయ వర్గాల సమాచారం..!

# రక్తదానమంటే.. ప్రాణదానమే



**- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**

రక్తదానం చేస్తే బాధితునికి ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం ప్రాధాన్యతను గుర్తించి అందరూ రక్తదానం చేయాలని, ముఖ్యంగా యువత రక్తదానం పట్ల అవగాహన పెంచుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. విజయవాడలో డా. అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో నెల్లూరులోని ఎన్జీఓ హోంలో ఈనెల 10న రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అరుణమ్మ ప్రారంభించారు. జేసీ కూర్మనాథ్, మేయర్ స్రవంతి, డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఆర్ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్ర'



నెల్లూరులోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్, 20వ డివిజన్ వైకాపా ఇన్‌చార్జి ఆర్‌ఎస్‌ఆర్ (రావు శ్రీనివాసరావు) ఆధ్వర్యంలో ఈ నెల 11న 20/1 సచివాలయ పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. క్రికెట్, షటిల్, వాలీబాల్ క్రీడాకారులకు అవసరమైన క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, జిల్లా మహిళా సెక్రటరీ పోతురాజు రమాదేవి, పోలంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, చిన్నా, 20/1 సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, స్థానిక క్రీడాకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో..అవగాహన



నెల్లూరులోని జడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న జడ్పీ హైస్కూల్ ఆవరణంలో 'చలికాలంలో చెవి, ముక్కు, గొంతు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై నెల్లూరు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ లకుమాదేవి ప్రసంగించి వాకర్స్‌కు అవగాహన కలిగించారు. అనంతరం ఆమెను వాకర్స్ ప్రతినిధులు సన్మానించారు. జడ్పీ వాకర్స్ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి బి.రామిరెడ్డి, సంఘం అధ్యక్షులు మెట్టు సుధాకర్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్–2022 నలుబోలు బలరామయ్యానాయుడు పాల్గొన్నారు. అనంతరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గులు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భాస్కర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, సీఎల్ ప్రసాద్, మేరీ బ్లెస్సింగ్టన్, ఎస్తేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# 'వాత్యల్స' విద్యార్థులకు..పండుగ దుస్తులు

సంక్రాంతి పండుగ సందర్భంగా నెల్లూరులోని వాత్సల్య అనాధబాలల శరణాలయంలో చదువుకుంటున్న 80 మంది విద్యార్థులకు పలువురు దాతలు కొత్త దుస్తులు అందజేశారు. మానవసేవే మాధవసేవ టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో వాటిని ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ షేక్ ఖాదరవలీ చేతులమీదుగా అందజేశారు.



## చేవూరు ఆధ్వర్యంలో..

# 200 మంది కాంగ్రెస్‌లోకి

రాష్ట్రంలో వస్తున్న రాజకీయ మార్పుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యాయి. నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి సిరివెళ్ళ నరేష్‌తో పాటు ఆయన అనుచరులు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా ఇప్పటి దాకా తెలుగుదేశం, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. కాంగ్రెస్‌లో చేరేందుకు వారంతా ఉత్సాహం చూపడంతో, చేవూరు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీనేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల తిరిగి కాంగ్రెస్‌లో చేరడం సంతోషదాయకమన్నారు. అదే స్ఫూర్తితో అనేకమంది కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఇదేవిధంగా ఇతర పార్టీల్లో ఉన్నవారు చాలామంది ఆయా పార్టీల తీరుతో విసుగు చెంది కాంగ్రెస్‌లోకి వస్తామని తమతో సంప్రదిస్తున్నారని, వారిని కూడా త్వరలో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తామని చెప్పారు. జిల్లాలోనూ, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయంగా తాము నిరంతరం పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, ఉడతా వెంకట్రావు, నగర అధ్యక్షుడు ఫయాజ్, డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, గణేష్‌బాబు, అల్లావుద్దీన్, రాజా, నాగిరెడ్డి రాజేష్, మహిళా నాయకురాలు లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగాలో సత్తాచాటిన కావ్యశ్రీ

## అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ బహుమతి



నెల్లూరుజిల్లాకు చెందిన గుంజి కావ్యశ్రీ అంతర్జాతీయ యోగా పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని నెల్లూరు పేరు మారు మ్రోగించింది. జనవరి 4 నుంచి 7వ తేదీవరకు పుదుచ్చేరిలో జరిగిన ఈ అంతర్జాతీయ పోటీల్లో కావ్యశ్రీ అత్యంత ప్రతిభతో అగ్రస్థానంలో నిలవడం విశేషం. పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి చేతుల మీదుగా ఆమె ప్రథమ బహుమతిని అందుకుంది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ పోటీల్లో వివిధ దేశాల నుంచి మెరికల్లాంటి యోగా క్రీడాకారులతో పాటు, మనదేశం నుంచి కూడా సుమారు రెండువేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇన్ని వేల మంది క్రీడాకారుల్లో జిల్లాకు చెందిన కావ్యశ్రీ ప్రథమస్థానం సాధించడంతో, జిల్లాకు చెందిన అనేకమంది యోగాక్రీడాకారులు, గురువులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు చెప్పారు.

**సన్మానించిన మేయర్ :**

అంతర్జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రథమస్థానం సాధించిన గుంజి కావ్యశ్రీని ఈనెల 9న నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి తన ఛేంబర్‌లో ఘనంగా సన్మానించారు. కావ్యశ్రీ మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షిస్తూ కావ్యశ్రీకి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్లు ప్రసన్న కుమార్, రవీంద్ర, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# విడవలూరులో విద్యార్థులకు బహుమతులు

సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని విడవలూరు ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఈనెల 8న బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నవీన్‌రెడ్డి, స్కూల్ ఛైర్మెన్ ఆదిశేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొని క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

# బాల్యవివాహాలు వద్దనే వద్దు



బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమని బాల్యవివాహ నిషేధ చట్టంపై జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 8న నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ వాత్సల్య స్కీమ్ తరపున జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 37 మండలాల నుంచి మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ళపాటు జైలుశిక్షణ, లక్ష రూపాయల వరకు జరిమానా ఉంటుందని చెప్పారు. ఎవరూ బాల్యవివాహాల జోలికి పోవద్దన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నిషేధ చట్టానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ కామాక్షి, బాలల సంరక్షణ అధికారిణులు సుమలత, సమత తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

## - తెలుగురైతు నాయకుల విమర్శ



రాష్ట్రంలో రైతన్నలను ప్రభుత్వం నట్టేట ముంచిందని, ఇటీవల భారీవర్షాలతో నష్టపోయిన రైతాంగానికి కేంద్రం నుంచి రావాల్సిన నష్టపరిహారం కూడా అందలేదని, రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో తగు చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని తెలుగురైతు నాయకులు విమర్శించారు. ఈనెల8న నెల్లూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు, పార్టీ నాయకులు ఈపూరు సుబ్బారెడ్డి, రమణారెడ్డి, మునుస్వామి, శ్రీకాంత్, మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ, వరి రైతులతోపాటు భారీగా నష్టపోయిన నిమ్మ, అరటి రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. రైతులంటే ముఖ్యమంత్రి జగన్‌కు చిన్నచూపు అన్నారు. ఇలాంటి అసమర్థప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని, రైతుల బాధలను పట్టించుకోని వైకాపాను రానున్న ఎన్నికల్లో ఓడించాలని రైతులకు పిలుపునిచ్చారు.

# సీఐల బదిలీలు

గుంటూరు రేంజ్ పరిధిలో ఈనెల 7న జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా, నెల్లూరు జిల్లాలోనూ పలువురు సీఐలకు స్థానచలనం కలిగింది. నెల్లూరు దర్గామిట్ట ఇన్స్‌పెక్టర్ బీవీవీ సుబ్బారావును రేంజ్ వీఆర్‌కు మార్చి, ఆ స్థానంలో గుంటూరు జిల్లా పొన్నూరు ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను నియమిస్తూ రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులిచ్చారు. ఆయన గతంలో ఆత్మకూరు సీఐగా పనిచేశారు. ఆదేవిధంగా, చిలకలూరిపేట రూరల్ సీఐ బి.అశోక్‌కుమార్‌ను నెల్లూరు చిన్నబజార్ ఇన్స్‌పెక్టర్‌గా నియమించారు. అశోక్‌కుమార్ గతంలో చిన్నబజార్ స్టేషన్‌లో పనిచేస్తూ చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఆ స్థానం ఖాళీగానే ఉండడంతో, అశోక్‌కుమార్‌కే ఆ స్థానాన్ని కేటాయించారు.

# ఘనంగా..మాతృసేవా పురస్కారాలు



మేడా బుజ్జమ్మ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్-విశాఖపట్టణం వారి ఆధ్వర్యంలో ఈ నెల 8న నెల్లూరు జిల్లా అల్లూరులో పలువురికి మాతృసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డి సంకల్పంతో గత ఏడు సంవత్సరాలుగా మాతృసేవా పురస్కారాలను ఏటా అయిదుగురికి అల్లూరులోను, విశాఖపట్టణంలోనూ అందజేస్తున్నారు. మేడా పాండురంగారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.మహేశ్వరరెడ్డి, అవధాని కోట రాజశేఖర్, జబర్దస్త్ ఫేమ్ 'షేకింగ్' శేషు, పెనాక సుజాత తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ, బిడ్డలకోసం తల్లి చేసే త్యాగాలను వివరించారు. ఎంత సేవ చేసినా తల్లి రుణాన్ని తీర్చుకోలేమన్నారు. చెన్నకేశవస్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మెన్ మేడా రామకృష్ణారెడ్డి, మేడా రామ సుబ్బారెడ్డి, కమలాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. తొలుత, పరిశినేటి కళ్యాణ్ కుమార్, కందల రాజారెడ్డి, మంచికలపాటి సుధీర్‌సింగ్, చల్లా సౌజన్య, పొట్లూరు చెంచయ్యలకు మాతృసేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. దుద్దుకూరు భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నృత్యాలను ప్రదర్శించిన కుమారి మద్దూరు సులక్షిత ప్రియధరణి, బేబి శ్రీవైష్ణవిలను, భజనబృందం వారిని ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

## టూకీగా...



### వెంకటాచలంలో ఘనంగా గంధమహోత్సవం

వెంకటాచలంలోని నాగూర్ మీరయ్య నిషాన్ దర్గా 54వ గంధమహోత్సవం ఈనెల 6వతేదీ రాత్రి వైభవంగా జరిగింది. గంధాన్ని ఊరేగింపుగా దర్గావద్దకు తీసుకువచ్చి పూజలు చేసి భక్తులకు పంచిపెట్టారు. దర్గా ముజావర్లు షేక్ ఇంతియాజ్, షేక్‌బాబు, నస్రుద్దీన్, నిజాముద్దీన్, షేక్ జిలాని, సిరాజుద్దీన్, ఫక్రుద్దీన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, జాకీర్ తదితరులు పర్యవేక్షించారు.

### పార్లపల్లిలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

విడవలూరు మండలంలోని పార్లపల్లి గిరిజన కాలనీ వాసులకు ఈనెల 7న గ్రామసర్పంచ్ రామిశెట్టి స్వాతి తన సొంతనిధులతో దుప్పట్లు పంపిణీచేశారు. టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

### లింగంపల్లిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవ

పొదలకూరు మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈనెల7న లింగంపల్లి దళితవాడలో పరిసరాలను శుభ్రం చేసి, ప్రజలకు డెంగ్యూ-మలేరియా-టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌డి నహీద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### వరికుంటపాడులో ఓటర్లకు అవగాహన

ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అధికారులు ఓటర్లకు అవగాహన కలిగిస్తున్నారు. ఈనెల 8న వరికుంటపాడు ఉన్నతపాఠశాలలో 88, 89 పోలింగ్‌కేంద్రాల ఓటర్లకు ఆమేరకు ఈవిఎంలు, వీవీప్యాట్లపై అవగాహన కలిగించారు. ప్రత్యేక అధికారి శ్రీనాథ్‌రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ వీరభద్రయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### తెగచర్ల పాఠశాలను సందర్శించిన డిఇఓ

రాపూరు మండలంలోని తెగచర్ల ప్రభుత్వ పాఠశాలను డీఈఓ గంగాభవాని ఇటీవల సందర్శించి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. పాఠ్యాంశాల బోధన సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

### జగదేవిపేట పీహెచ్‌సీ తనఖీ

ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు ఆమె వెంట వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ సిహెచ్ సురేంద్ర, డీపీఎంఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ముత్తుకూరులో రైతులకు శిక్షణ

ముత్తుకూరు మండలంలోని రైతులకు వేరుశెనగ సాగుపై ఇటీవల జిల్లా వ్యవసాయశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఆత్మ ప్రాజెక్టు అధికారి శివన్నారాయణ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం జరిగింది.ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ గీతావాణి, వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, విజయకుమార్, ముత్తుకూరు వ్యవసాయాధికారిణి జ్యోత్సరాణి తదితరులు పాల్గొన్నారు.

### అలగానిపాడులో గ్రామ సభ

ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేపై ఇటీవల విడవలూరు మండలం అలగానిపాడులో సర్పంచ్ శేషయ్య ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ రీ-సర్వేను భూ హక్కుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన గామస్తులకు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ భానుప్రకాష్, సర్వేయర్ శ్రీరామ్ శోభన్‌బాబు, రీ-సర్వే డీటీ అజీజ్ ఉల్లాఖాన్, వీఆర్ఓ గౌతమి పాల్గొన్నారు.

### సింగారెడ్డిపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

సీతారామపురం మండలంలోని సింగారెడ్డిపల్లిలో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్నవారికి మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీఓ భార్గవి, వైద్యాధికారిణి స్వప్న, మండల వైకాపా కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అల్లూరురాజు తదితరులు పాల్గొన్నారు.



## చెన్నైలో పార్లమెంటరీ కమిటీ నేతలతో.. బిఎంఆర్

చెన్నైలో ఓబీసీల సంక్షేమానికి సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులను రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఈనెల 8న కలసి, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. రాజ్యసభ సభ్యులైన హరినాథ్ సింగ్‌యాదవ్‌ను గౌరవపూర్వకంగా కలసి ఓబీసీ స్థితిగతులను సమీక్షించారు. చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, వారి సంక్షేమానికి బడ్జెట్ పెంచాలని, కులగణన చేపట్టాలని ఈ సందర్భంగా బీఎంఆర్ కోరారు. తమిళనాడు యాదవ మహాసభ అధ్యక్షులు ఎన్‌జే రామచంద్రన్‌యాదవ్, ద్రవిడ దేశం అధ్యక్షులు కృష్ణారావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విఎస్‌యు అభివృద్ధికి కృషిచేస్తాం



### - మంత్రి కాకాణి

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం అభివృద్ధికి కృషిచేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 8న విఎస్‌యులో వీసీ ఆచార్య జిఎం సుందరవల్లితో కలసి నూతనంగా నిర్మించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రూ. 93లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాకొక యూనివర్సిటీ ఉండాలని దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో నెల్లూరు జిల్లాలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఏర్పాటైందన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుకు కారకులైన ఆ మహానేత విగ్రహాన్ని యూనివర్సిటీలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రూ. 100 కోట్లతో యూనివర్సిటీ అభివృద్ధి పనులకు వీసీ సుందరవల్లి ప్రణాళికలు రూపొందించారని అంటూ, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆమేరకు నిధులు కేటాయించి యూనివర్సిటీ అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు.








## 29వ వర్ధంతి

జర్నలిజం వ్యాపారం కాకూడదు..
జర్నలిస్టులు క్యాపిటలిస్టులుగా మారకూడదు.
అలా జరిగిన రోజున ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే
నాలుగు స్తంభాలలో ఓ మూలస్తంభం కూలిపోయినట్టే!

- కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు, లాయర్

### స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారు

జననం: 08-11-1930 నిర్యాణం: 18-01-1995

మహనీయుని మహాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com